నేడు నగరానికి రాష్ట్రపతి


రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

చెన్నై, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల పర్యటన నిమిత్తం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం చెన్నై నగరానికి రానున్నారు. మధ్యాహ్నం నగరానికి చేరుకునే రాష్ట్రపతి నందంబాక్కం ట్రేడ్ సెంటర్‌లో జరిగే సిటీ యూనియన్ బ్యాంక్ 120వ వార్షిక వేడుకల్లో పాల్గొంటారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతితో పాటు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా హాజరుకానున్నారు. ఈ కార్యక్రమం అనంతరం రాష్ట్రపతి రాజ్‌భవన్ చేరుకుని రాత్రికి అక్కడే బసచేస్తారు. బుధవారం ఉదయం 10.55 గంటలకు చెన్నై నుంచి విమానంలో తిరుచ్చికి వెళ్తారు. అక్కడి నుండి హెలికాప్టర్‌లో తిరువారూరు జిల్లా నీలక్కుడి చేరుకుంటారు. అక్కడ ఉన్న తమిళనాడు సెంట్రల్ యూనివర్శిటీ దశమ స్నాతకోత్సవంలో పాల్గొని విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేయనున్నారు. స్నాతకోత్సవం అనంతరం సాయంత్రం 4.30 గంటలకు ఆమె హెలికాప్టర్‌లో శ్రీరంగం యాత్రీనివాస్ ఎదురుగా కొల్లిడం వాగు ఒడ్డున హెలిపాడ్‌లో దిగుతారు. అక్కడి నుండి కారులో బయలుదేరి సాయంత్రం 5.20 గంటలకు శ్రీరంగనాథస్వామివారిని దర్శించుకుంటారు. ఆ తర్వాత కారులో తిరుచ్చి చేరుకుని, తిరుచ్చి విమానాశ్రయం వద్ద రాత్రి అల్పాహారం సేవించిన అనంతరం అక్కడి నుండి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయలుదేరివెళతారు. రాష్ట్రపతి పర్యటనను పురస్కరించుకుని శ్రీరంగం పంచకరై హెలిపాడ్‌ను తంజావూరు అధికారులు సోమవారం ఉదయం పరిశీలించారు. తిరుచ్చి విమానాశ్రయం, హెలిపాడ్ ప్రాంతం, శ్రీరంగం రంగనాథస్వామివారి ఆలయం తదితర ప్రాంతాల్లో గట్టి భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు. ఇదే విధంగా రాష్ట్రపతి చెన్నై పర్యటనను పురస్కరించుకుని పోలీసు ఉన్నతాధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేపడుతున్నారు. ఇక సిటీ యూనియన్ బ్యాంక్ వార్షికోత్సవం జరిగే ట్రేడ్ సెంటర్ చుట్టూ సాయుధ బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇదే రీతిలో రాజ్‌భవన్ వద్ద కూడా పోలీసు భద్రత పెంచారు. నగర పోలీసు కమిషనర్ అరుణ్ భద్రతా ఏర్పాట్లను స్వయంగా పరిశీలిస్తున్నారు.

పెట్టుబడులతో రండి!

● జర్మనీ ప్రవాస తమిళుల సభలో సీఎం స్టాలిన్

చెన్నై, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ద్రావిడ తరహా పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తోందని, జర్మనీలో స్థిరపడిన తమిళ పారిశ్రామిక వేత్తలు రాష్ట్రంలో పారిశ్రామిక రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని ముఖ్యమంత్రి స్టాలిన్ పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి జర్మనీలోని కోలోన్ నగర్‌లో జరిగిన ప్రవాస తమిళుల సభలో ఆయన ప్రసంగించారు. జర్మనీలో నివసిస్తున్న తమిళులను చూస్తుంటే తనకెంతో ఆనందంగా ఉందని, వారి ముఖాల్లో ఎల్లప్పుడూ ప్రశాంతత కనిపిస్తోందన్నారు. డీఎంకే వ్యవస్థాపకుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి అన్నాదురై కూడా మలేసియా, సింగపూర్ దేశాల్లో పర్యటించినప్పుడు అక్కడి తమిళులంతా ప్రశాంతంగా ఉండటం చూసి ఆశ్చర్యపోయారని, అలాంటి భావనే జర్మనీలోని తమిళులను చూస్తుంటే తనకు కలుగుతోందన్నారు. తమిళులు ఎక్కడున్నా తమ భాష, సంస్కృతి, సంప్రదాయాలను మరువకూడదన్నారు. ద్రావిడ తరహా పాలన అందించే డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని రంగాల్లోనూ రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని, ముఖ్యంగా పారిశ్రామిక రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని, కొత్త పరిశ్రమలు నెలకొల్పుతున్నామన్నారు. గతంలో యూఏఈ, జపాన్, స్పెయిన్, సింగపూర్, అమెరికా దేశాల్లో పర్యటించినప్పుడు విదేశీ పారిశ్రామిక పెట్టుబడులు సమీకరించగలిగానని, ఆ విధంగానే ప్రస్తుతం జర్మనీ, ఇంగ్లండ్‌లో పెట్టుబడులను సమీకరించి, రాష్ట్రంలో మరిన్ని పరిశ్రమలు నెలకొల్పుతామన్నారు. ప్రవాస తమిళుల సంక్షేమం కోసం ప్రవాస తమిళుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేశామని, ప్రవాస తమిళులకు సాయం చేసేందుకు టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్లు, వారి సంక్షేమం కోసం నిధులు కూడా కేటాయించామని స్టాలిన్ పేర్కొన్నారు. తమిళ సంప్రదాయం ఉట్టిపడేలా చాటేలా పట్టు ధోవతి, పట్టు హాఫ్‌షర్టు, పట్టు అంగవస్త్రం ధరించి ఈ సభలో స్టాలిన్ పాల్గొన్నారు.


జర్మనీలోని కోలోన్ నగరంలో ప్రవాస తమిళుల సమావేశంలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి

కోలోన్ వర్సిటీ తమిళ గ్రంథాలయం పరిశీలన

జర్మన్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి స్టాలిన్, ఆయన సతీమణి దుర్గాస్టాలిన్ సోమవారం ఉదయం కోలోన్ విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని తమిళ శాఖ గ్రంథాలయాన్ని సందర్శించారు. అందులో సుమారు 40 వేలకు పైగా తమిళ సాహితీ గ్రంథాలు, తాళపత్ర గ్రంథాలున్నాయి. వీటిని స్టాలిన్ దంపతులు ఆసక్తిగా తిలకించారు. వారిద్దరికీ గ్రంథాలయంలోని ప్రొఫెసర్లు డాక్టర్ స్వెన్ వోర్ట్‌మేన్, షరూన్ నాథన్, డరియా లాంబ్రెచ్ శాలువతో సత్కరించి స్వాగతం పలికారు. ఈ విషయాన్ని స్టాలిన్ తన ఎక్స్‌పేజీలో పొందుపరుస్తూ కోవై, తిరుచ్చిలో ఏర్పాటుకానున్న భారీ గ్రంథాలయంలో కోలోన్ వర్సిటీ తరహా సదుపాయాలను కల్పించనున్నట్లు పేర్కొన్నారు.


తమిళ శాఖ గ్రంథాలయం వివరాలను స్టాలిన్‌కు వివరిస్తున్న నిర్వాహకులు

టీచర్ అర్హత పరీక్ష తప్పనిసరి

● టెట్ లేకుంటే ఉద్యోగాలు వదిలిపోవాల్సిందే ● లేకుంటే పదవీ విరమణ చేయండి
● తేల్చిచెప్పిన సుప్రీంకోర్టు



పెరంబూర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పోస్టులో కొనసాగాలన్నా, పదోన్నతులు పొందాలన్నా ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) తప్పనిసరి అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఎయిడెడ్, ప్రైవేటు విద్యా సంస్థలు, మైనార్టీ విద్యా సంస్థల్లో పని చేసే వారికి ఉపాధ్యాయ అర్హత పరీక్ష తప్పనిసరి కాదంటూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దీపాంకర్ దత్తా నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఎయిడెడ్, ప్రైవేటు, మైనార్టీ విద్యా సంస్థలకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వాలని, దానిని నిర్బంధం చేయరాదని అభ్యర్థించారు. ముఖ్యంగా మైనార్టీ విద్యా సంస్థలు రాజ్యాంగం వారికి ఇచ్చిన హక్కుల ఆధారంగా పనిచేయడానికి అనుమతించాలని కోరారు. ఇరువర్గాల వాదనల్ని ఆలకించిన ధర్మాసనం.. తీర్పు వెలువరించింది. ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయులు విధుల్లో కొనసాగాలన్నా, పదోన్నతులు పొందాలన్నా టెట్ తప్పనిసరి అని తేల్చి చెప్పింది. అయినప్పటికీ, వివిధ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని కొంత వెసులుబాటు కల్పించింది. పదవీ విరమణ కాలం ఐదేళ్ల మాత్రమే ఉన్న వారు విధుల్లో కొనసాగవచ్చని, ఐదేళ్లకు మించి ఉన్న ఉపాధ్యాయులు తాము ఉద్యోగంలో కొనసాగాలంటే టెట్‌లో అర్హత సాధించాల్సిందేనని పేర్కొంది. టెట్ లేని ఉపాధ్యాయులు తమ ఉద్యోగాలు వదులుకోవచ్చని, లేదా పదవీ విరమణ చేయవచ్చని స్పష్టం చేసింది. అదే సమయంలో, ప్రభుత్వ సాయం పొందే మైనార్టీ విద్యా సంస్థల్లో టెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం తప్పనిసరి చేయవచ్చా? అలాంటి చర్యలు వారి హక్కులను ప్రభావితం చేస్తుందా? అనే అంశాలపై విచారణ జరిపేందుకు ఈ పిటిషన్‌ను మరో ధర్మాసనానికి బదిలీ చేయాలని ప్రధాన న్యాయమూర్తికి సిఫారసు చేసింది.

ఇండియా కూటమి బలంగా ఉంది

● టీఎన్‌సీసీ చీఫ్ సెల్వపెరుందగై

అడయార్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సారథ్యంలోని ఇండియా కూటమి ఎంతో బలంగా, ఐక్యంగా ఉందని టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై అభిప్రాయపడ్డారు. ఆయన సోమవారం నెల్లైలో మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్ర డీజీపీ పదవీ విరమణ తర్వాత ఇన్‌చార్జ్ డీజీపీలు నియమించడం కొత్తేం కాదన్నారు. ఉత్తరప్రదేశ్‌లో ఐదుసార్లు ఇన్‌చార్జ్ డీజీపీలను నియమించిన చరిత్ర ఉందన్నారు. ఇకపోతే, సీఎం స్టాలిన్ విదేశీ పర్యటనపై శ్వేతపత్రం విడుదల చేయాలని అన్నాడీఎంకే నేతలు డిమాండ్ చేస్తున్నారని, పార్లమెంట్ సమావేశాలు జరిగే సమయంలో ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటనలకు వెళ్ళారని, ప్రధాని పర్యటనలపై వారు శ్వేతపత్రాన్ని డిమాండ్ చేయాలని సూచించారు. దివంగత నేత జీకే మూపనార్ కలలో కూడా బీజేపీకి మద్దతు తెలపలేదని ఆయన గుర్తు చేశారు.

ఇన్‌చార్జ్ డీజీపీ నియామకంపై

సుప్రీంకోర్టులో పిటీషన్

పెరంబూర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఇన్‌చార్జ్ డీజీపీ నియామకాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ మేరకు సామాజిక కార్యకర్త హెన్నీ థిబేల్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. రాష్ట్ర శాంతి భద్రతల విభాగం డీజీపీగా పనిచేసిన శంకర్ జివాల్ ఆగస్టు 31న పదవీవిరమణ చేసిన విషయం తెలిసిందే. దీంతో ఇన్‌చార్జ్ డీజీపీగా వెంకట్రామన్‌ను ప్రభుత్వం నియమించింది. నిజానికి శంకర్ జివాల్ స్థానంలో కొత్తగా డీజీపీని నియమించాల్సివుండగా, రాష్ట్ర ప్రభుత్వం.. ఇన్‌చార్జ్ డీజీపీని మాత్రమే నియమించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ హెన్నీ థిబేల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. డీజీపీ నియమాకంలో ఇన్‌చార్జ్ అనే పదం వినియోగించరాదని సుప్రీంకోర్టు గతంలోనే స్పష్టం చేసిందని, ఇందుకు విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేయాలని పిటిషనర్ అభ్యర్థించారు.

డీజీపీతో చెన్నై కమిషనర్ భేటీ


ఇన్‌చార్జ్ డీజీపీతో పోలీసు కమిషనర్ అరుణ్

రాష్ట్ర శాంతి భద్రతల ఇన్‌చార్జ్ డీజీపీ వెంకట్రామన్‌ను చెన్నై పోలీసు కమిషనర్ అరుణ్ మర్యాద పూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం వెంకట్రామన్ పదవీ బాధ్యతలు స్వీకరించగా, ఆ కార్యక్రమంలో చెన్నై పోలీసు కమిషనర్ పాల్గొనకపోవడం పలు విమర్శలకు దారి తీసింది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై తీవ్ర అసంతృప్తితో వుండడం వల్లనే అరుణ్ ఇన్‌చార్జ్ డీజీపీని కలుసుకోలేదని మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో ఆ ఊహాగానాలను పటాపంచాలు చేస్తూ చెన్నై పోలీసు కమిషనర్ ఇన్‌చార్జ్ డీజీపీని మర్యాద పూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు.

సిరుగనూరు వద్ద బస్సును ఢీకొన్న కారు

ముగ్గురి దుర్మరణం

చెన్నై, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి - చెన్నై జాతీయ రహదారిలో సిరుగనూరు వద్ద సోమవారం వేకువజాము సంభవించిన రోడ్డు ప్రమాదంలో యేడాది పసిబిడ్డ సహా ముగ్గురు దుర్మరణం చెందారు. వివరాలిలా... తెన్‌కాశి ఆలంకుళం ప్రాంతానికి చెందిన కారు డ్రైవర్ జోసెఫ్ తెన్‌కాశిలో ఓ వివాహ వేడుకల్లో పాల్గొని ఆదివారం సాయంత్రం కారులో చెన్నై బయలుదేరాడు. ఆ కారులో ఆలంకుళం ప్రాంతానికి చెందిన సెల్వకుమార్, ఆయన భార్య యశోద, యేడాది వయసున్న అనోన్య అనే పసిబిడ్డ, వీరి స్నేహితుడు విజయబాబు ప్రయాణించారు. సోమవారం వేకువజాము రెండు గంటల ప్రాంతంలో తిరుచ్చి - చెన్నై జాతీయ రహదారిలో సిరుగనూరు సమీపం నెడుంకూర్ వద్ద ఆ కారు అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా ధ్వంసమై అందులోన్న యశోద, అనోన్య, విజయబాబు సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. కారు శిథిలాల మధ్య చిక్కుకున్న మరి ఇద్దరిని పోలీసులు వెలికి తీసి.. చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డీఎస్పీ దినేష్‌కుమార్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బస్సు మరమ్మతుకు గురై, ఆగి ఉండగా, హెచ్చరిక బోర్డు లేకపోవడంతో కారు డ్రైవర్ బస్సు ఆగి ఉందని తెలియక పోవడంతో ఈ ప్రమాదం సంభవించిందని పోలీసులు తెలిపారు.

తనయుడిపై చర్యలకు రాందాస్ వెనకడుగు ?

● తైలాపురం నుంచి పర్యటన ప్రారంభించిన అన్బుమణి

చెన్నై, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తన ఆదేశాలను ధిక్కరిస్తూ పోటీగా పార్టీ నడుపుతున్న తనయుడు డాక్టర్ అన్బుమణిని పార్టీ నుండి బహిష్కరించేందుకు ఆయన తండ్రి పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ తటపటాయిస్తున్నారు. పార్టీ క్రమశిక్షణ ఉల్లఘించారంటూ అన్బుమణికి పదిహేను రోజుల క్రితం రాందాస్ షోకాజ్ నోటీసు పంపారు. ఆగస్టు 31లోగా సమాధానం చెప్పకపోతే సెప్టెంబర్ 1న పార్టీ క్రమశిక్షణా కమిటీ సమావేశమై నిర్ణయం తీసుకుంటుందని ఆ నోటీసులో హెచ్చరించారు. అయితే అన్బుమణి ఎలాంటి సంజాయిషీ ఇవ్వకపోడంతో సోమవారం ఆయనను పార్టీ నుండి బహిష్కరిస్తారని అందరూ అనుకున్నారు. దిండివనం తైలాపురం గార్డెన్‌లో రాందాస్ అధ్యక్షతన పార్టీ క్రమశిక్షణా కమిటీ సమావేశం జరిగింది. ఆ సమావేశంలో అన్బుమణిని పార్టీ నుండి బహిష్కరించే విషయమై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అయినట్లు తెస్తోంది. దీంతో అన్బుమణిపై వేటు వేసే విషయంపై ఎలాంటి నిర్ణయం ప్రకటించలేదు. ఆ సమావేశంలో పాల్గొన్న రాందాస్ మద్దతుదారుడైన పీఎంకే ఎమ్మెల్యే అరుళ్ మాట్లాడుతూ తైలాపురం గార్డెన్‌లో తొమ్మిదిమంది సభ్యులున్న క్రమశిక్షణా కమిటీ సమావేశమైనప్పటికీ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని పేర్కొన్నారు. తైలాపురం గార్డెన్‌లో రాందాస్ ఆయన మద్దతుదారులంతా మల్లగుల్లాలు పడుతున్న సమయంలోనే అన్బుమణి తిరువణ్ణామలై నుంచి బయలుదేరి సోమవారం మధ్యాహ్నం విల్లుపురం సెంజి కోట ప్రాంతానికి చేరారు. సెంజికోటలో వీరాంజనేయ స్వామివారిని దర్శించుకున్నారు. అక్కడి నుండి కారులో బయలుదేరి దిండివనానికి నాలుగు గంటలకు చేరుకున్నారు. దిండివనం వద్ద రాందాస్ స్వగృహం (ప్రస్తుతం ఆ ఇంటిలో రాందాస్ కుమార్తె శ్రీకాంతి నివసిస్తోంది) సమీపంలోని కామాక్షి అమ్మన్ ఆలయం నుంచి అన్బుమణి 'ఇనమే ఎళు... ఉరిమై పెరు' అంటూ వన్నియార్ల హక్కుల సాధన ప్రచార పాదయాత్ర ప్రారంభించి, వండిమేడు దిడల్ వద్ద ఏర్పాటైన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు.


సెంజికోటలో ఆంజనేయస్వామిని దర్శించుకున్న అన్బుమణి

అడుగడుగునా ప్రజాస్పందన

● మాజీ సీఎం ఎడప్పాడి పళనిస్వామి
● వంద నియోజకవర్గాల్లో పర్యటన సమాప్తం

చెన్నై, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): 'మక్కళై కాప్పోమ్...తమిళగత్తై మీడ్పోమ్' (ప్రజలను కాపాడుదాం... రాష్ట్రానికి విముక్తి కల్పిద్దాం...!) పేరుతో తాను చేపట్టిన పర్యటన వంద నియోజకవర్గాల్లో విజయవంతంగా పూర్తయిందని, అన్ని చోట్లా మహిళలు, యువత తనకు ఘనస్వాగతం పలుకుతున్నారని, వీరి స్పందన చూస్తుంటే శాసనసభ ఎన్నికల్లో తప్పకుండా అధికారంలోకి వస్తామనే నమ్మకం కలుగుతోందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) అన్నారు. సోమవారం సాయంత్రం మదురై నగరం నుంచి రెండో విడత పర్యటన ప్రారంభిస్తున్న సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... ప్రతి నియోజకవర్గంలోనూ తన రోడ్‌షోలకు లక్షలాదిమంది ప్రజలు వస్తుండడం తనకెంతో సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. రోజుకు మూడు అసెంబ్లీ నియోజకవర్గాల చొప్పున ఇప్పటికి 100 నియోజకవర్గాలలో ప్రచార పర్యటించానని చెప్పారు. జూలై 7న కోవై నియోజకవర్గం వర్గం మేట్టుపాళయంలో తన ప్రచారం ప్రారంభమైందని, ఇటీవలే ఆర్కాడు నియోజకవర్గంలో పర్యటన ముగించానని, దీంతో వంద నియోజకవర్గాల్లో పర్యటన పరిసమాప్తమైందని చెప్పారు. తన పర్యటన సవ్యంగానే సాగుతోందని, అక్కడక్కడా పాలకపక్షం పర్యటన భగ్నం చేయాలని ప్రయత్నాలు కూడా చేశారని, అన్నాడీఎంకే కార్యకర్తలు అప్రమత్తంగా వ్యవహించడంతో వారి ఆటలు సాగలేదని ఈపీఎస్ పేర్కొన్నారు. నిరుద్యోగ యువకులంతా అన్నాడీఎంకేపైనే ఆశలు పెట్టుకున్నారని, అధికారంలోకి వస్తే తమకు ఉద్యోగవకాశాలు కలుగుతాయని ఎదురుచూస్తున్నారని, వారి ఆశలను నెరవేర్చటమే తమ ఆశయమన్నారు. అందరికీ నిరాటంకంగా తాగునీరు, విద్యుత్ సరఫరా చేయడం, పరిశ్రమలు నెలకొల్పడటం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని, ఈ లక్ష్యాలను డీఎంకే ప్రభుత్వం నెరవేర్చకపోవడంతో ప్రజలంతా ఆగ్రహంతో ఉన్నారని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారని కూడా తెలిపారు. రాజకీయపరంగాను, వ్యక్తిగతంగాను తానెవరికీ భయపడనని, ఎలాంటి తప్పులు చేయనప్పుడు ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదనే తాను భావిస్తానని ఈపీఎస్ పేర్కొన్నారు.


స్వాతంత్ర్య సమరయోధుడు పులిదేవర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఈపీఎస్

నిమజ్జనంతో

77 టన్నుల వ్యర్థాలు


మెరీనాతీరంలో పేరుకుపోయిన చెత్త

పెరంబూర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వినాయక ప్రతిమల నిమజ్జనం సందర్భంగా నగరం, శివారులోని సముద్ర తీరప్రాంతాల్లో 77 టన్నుల చెత్త పేరుకుపోయింది. విగ్రహాల నిమజ్జనానికి పట్టినంబాక్కం, కాశిమేడు, ఎన్నూర్, తిరువొత్తియూర్, పాలవాక్కం సముద్రతీరాలు ఎంపిక చేయగా, భక్తులు ఆదివారం ఆయా ప్రాంతాల్లో ప్రతిమలు నిమజ్జనం చేసిన విషయం తెలిసిందే. విగ్రహాల నిమజ్జనం సమయంలో కట్టెలు, విగ్రహానికి వేసిన భారీ పూల దండలు సహా భారీగా వ్యర్థాలు తీరానికి కొట్టుకొచ్చాయి. కార్పొరేషన్ కార్మికులు సోమవారం ఉదయం నుంచి మొత్తం 77 టన్నుల వ్యర్థాలు తొలగించారు. మెరీనా తీరంలో అధికంగా 22 టన్నులు, తిరువాన్మియూర్‌లో 21, పట్టినంబాక్కం శ్రీనివాసపురం ప్రాంతాల్లో తలా 20, కాశిమేడులో 8, తిరువొత్తియూర్‌లో 7 టన్నుల వ్యర్థాలు తొలగించారు. గత ఏడాదిలాగే ఈ ఏడాది స్వచ్ఛంద కార్యకర్తలను నియమించడంతో వారు విగ్రహాలను లోతైన ప్రాంతం వరకు తీసుకెళ్లి నిమజ్జనం చేయడంతో విగ్రహాలు తీరానికి రాలేదు. వ్యర్థాల తొలగింపు పనుల్లో సుమారు 50 మంది కార్మికులు పాల్గొన్నట్లు చెన్నై కార్పొరేషన్ ఒక ప్రకటనలో తెలిపింది.


వ్యర్థాలను తొలగిస్తున్న కార్పొరేషన్ కార్మికులు

సమాచార దర్శిని

రూ.101 కోట్లతో డీఎంఎస్ కార్యాలయం

పెరంబూర్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): తమిళనాడు డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ అండ్ రూరల్ వెల్ఫేర్ సర్వీసెస్ (డీఎంఎస్) నూతన కార్యాలయాన్ని రూ.101.90 కోట్లతో నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రాష్ట్ర ప్రజా సంక్షేమ శాఖ పరిధిలోని వైద్య గ్రామీణ సంక్షేమ డైరెక్టరేట్ డీఎంఎస్ ప్రాంగణంలోని పాత భవనంలో పనిచేస్తుంది. ఆ భవనం వినియోగానికి వీలుకాని నేపథ్యంలో, కార్యాలయం 108 అంబులెన్స్ కార్యాలయంలోకి మార్చారు. అలాగే, వైద్య గ్రామీణ సంక్షేమ డైరెక్టరేట్ ఈఎస్ఐ యూనిట్‌ను అయనావరం ఈఎస్ఐ ఆస్పత్రికి బదిలీ చేశారు. ఈ క్రమంలో, వైద్య,గ్రామీణ సంక్షేమ డైరెక్టరేట్ (డీఎంఎస్) కార్యాలయ కొత్త భవనం కోసం రూ.103.40 కోట్లు కావాలని విజ్ఞప్తి చేయగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.101.90 కోట్లకు అనుమతిస్తూ జీవో విడుదల చేసింది. తేనాంపేట డీఎంఎస్ ప్రాంగణంలో గ్రౌండ్ ఫ్లోర్, 8 అంతస్తులతో నిర్మితం కానుందని అధికారులు తెలిపారు.

తగ్గిన వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర

పెరంబూర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య సిలిండర్ గ్యాస్ ధర రూ.51.50 తగ్గింది. అంతర్జాతీయ ముడిచమురు ధరలకు అనుగుణంగా గ్యాస్ సిలిండర్ ధరలను ఆయిల్ సంస్థలు సమీక్షించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతించింది. ఆ ప్రకారం, ఈ నెలకు సంబంధించి వాణిజ్య సిలిండర్ గ్యాస్ ధర రూ.51.50 తగ్గి రూ.1,738కి విక్రయమవుతుంది. కాగా, వాణిజ్య సిలిండర్ జూన్‌లో రూ.24, జూలైలో రూ.58.50, ఆగస్టులో రూ.33.50 ధర తగ్గిన విషయం తెలిసిందే. అదే సమయంలో, గృహ వినియోగ సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పు లేకుండా రూ.868.50కే విక్రయిస్తున్నారు.

కల్పాక్కంలో ఆగిన విద్యుదుత్పత్తి

పెరంబూర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా కల్పాక్కం అణు విద్యుత్ కేంద్రంలో సాంకేతిక కారణంగా రెండో యూనిట్‌లో విద్యుదుత్పత్తి నిలిపివేశారు. ఈ కేంద్రంలో తలా 220 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండు యూనిట్లు పనిచేస్తున్నాయి. మొదటి యూనిట్‌లో ఏర్పడిన సాంకేతికలోపం సరిచేయకపోవడంతో ఎనిమిదేళ్లుగా విద్యుదుత్పత్తి జరుగలేదు. ప్రస్తుతం రెండో యూనిట్‌లో సాంకేతిక నిర్వహణ కారణంగా సోమవారం నుంచి 75 రోజులు విద్యుదుత్పత్తి నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

చెన్నై తిరిగొచ్చిన అండమాన్ విమానం

పెరంబూర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వాతావరణం అనుకూలించకపోవడంతో అండమాన్ వెళ్లిన విమానం తిరిగి చెన్నై చేరుకుంది. స్థానిక మీనంబాక్కం విమానాశ్రయం నుంచి 174 మంది ప్రయాణికులతో ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సోమవారం ఉదయం అండమాన్ వెళ్లింది. అండమాన్ విమానాశ్రయంలో భారీ గాలులు వీస్తుండడతో విమానం ల్యాండింగ్ చేయలేని పరిస్థితి నెలకొంది. పైలెట్ సమాచారంతో అధికారులు విమానాన్ని తిరిగి చెన్నై తీసుకురావాలని సూచించారు. విమానం చెన్నై చేరుకోగా, ప్రయాణికులకు విమానాశ్రయంలో బస ఏర్పాటుచేసిన అధికారులు, అండమాన్‌లో వాతావరణం అనుకూలించిన తరువాత విమానం బయల్దేరి వెళుతుందని ప్రకటించారు.

కొడైకెనాల్‌లో ఒకే ప్రవేశ రుసుము

పెరంబూర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక కేంద్రం కొడైకెనాల్‌లో పర్యాటక ప్రాంతాలకు ఒకే ప్రవేశ రుసుము సదుపాయం సోమవారం నుంచి అమలులోకి వచ్చింది. కొడైకెనాల్‌కు వచ్చే పర్యాటకులు గుణ గుహ, తూన్‌పారై, మేయర్ స్క్వేయర్, పైన్ ఫారెస్ట్ తదితర నాలుగు ప్రాంతాలకు వెళ్లాలంటే వేర్వేరుగా ప్రవేశ రుసుము చెల్లించాల్సి ఉంటుంది. దీంతో, పర్యాటకులు సమయం వృధా అవుతోంది. దీనిపై దృష్టి సారించిన జిల్లా యంత్రాంగం, నాలుగు ప్రాంతాలకు ఒకే ప్రవేశ రుసుము చెల్లించే సదుపాయాన్ని సోమవారం నుంచి అమలుచేసింది. రాష్ట్ర, పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే పిల్లలకు రూ.20, పెద్దలకు రూ.30, విదేశీ పర్యాటకులకు రూ.1,000 ప్రవేశ రుసుముగా నిర్ణయించారు.

ఇంటిగ్రేటెడ్ బీఎడ్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ టీచర్ల కోసం ఇంటిగ్రేటెడ్ నాలుగేళ్ల బీఎడ్ కోర్సు అనుమతి పొందేందుకు నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటీఈ) చివరి అవకాశం కల్పించింది. నూతన జాతీయ విద్యా విధానం ప్రకారం, గ్రాడ్యుయేట్ టీచింగ్ కోర్సు నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఎడ్ కోర్సుగా మార్చబడింది. ఈ కోర్సు ప్రారంభించేందుకు కళాశాలలు దరఖాస్తు చేసుకోవచ్చని ఎన్‌సీటీఈ గత ఫిబ్రవరిలో ప్రకటన విడుదల చేసింది. దరఖాస్తు గడువు జూలైతో ముగియగా, పలు కళాశాలలు దరఖాస్తు చేసుకోలేదని సమాచారం. దీనిపై దృష్టి సారించిన ఎన్‌సీటీఈ, బీఏ, బీఎస్సీ డిగ్రీతో పాటు బీఎడ్ కోర్సు అందించే ఈ ప్రోగ్రామ్‌లో చేరడానికి ఆసక్తి ఉన్న కళాశాలలు 'ఎన్‌సీటీఈ' వెబ్‌సైట్‌లో మరో రెండు వారాల్లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రకటన విడుదల చేసింది.

● అమెరికా 50 శాతం పన్ను ఎఫెక్ట్...

జీడిపప్పు ఎగుమతులపై ప్రభావం



జీడిపప్పును విభజిస్తున్న మహిళా కార్మికులు

పెరంబూర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి హార్బర్ నుంచి అమెరికాకు జీడిపప్పు ఎగుమతులు స్తంభించాయి. దేశం నుంచి జీడిపప్పు ఎగుమత్తుల్లో కడలూరు జిల్లా బన్రూటి అధిక వాటా కలిగి ఉంది. దేశంలో పలు ప్రాంతాల్లో జీడిపప్పు సాగుచేస్తున్నా, బన్రూటి జీడిపప్పుకు మాత్రం ప్రత్యేక రుచి కలిగి ఉంటుంది. బన్రూటి, కురింజిపట్టి, విరుదాచలం తదితర ప్రాంతాల్లో సుమారు 28,500 హెక్టార్ల విస్తీర్ణంలో జీడిపప్పు సాగు చేస్తుండగా, ప్రతి ఏడాది 22,168 టన్నుల జీడిపప్పు ఉత్పత్తి అవుతోంది. ఈ ప్రాంతంలో సాగుచేసే జీడిపప్పు అమెరికా, సింగపూర్, మలేసియా, ఐరోపా, రష్యా, సౌదీ అరేబియా, దుబాయ్, ఒమన్ సహా పలు దేశాలకు ఎగుమతి చేస్తుంటారు. తద్వారా వేల కోట్ల విదేశీ మారకం వస్తోంది. రాష్ట్రంలో జీడిపప్పు సాగులో 2 లక్షల మంది మహిళలు ప్రత్యక్షంగా, మరో లక్ష మంది మహిళలు పరోక్షంగాను పనిచేస్తున్నారు. రష్యా నుంచి ముడిచమురు కొనుగోలును భారత్ తక్షణం నిలిపివేయాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సూచించగా, భారత్ నిరాకరించడంతో, భారత్ నుంచి అమెరికా దిగుమతి చేసే వస్తువులపై 50 శాతం పన్ను విధిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఈ పన్ను విధింపు గత నెల 27వ తేది నుంచి అమలులోకి వచ్చింది. ఈ క్రమంలో, కొద్దిరోజులుగా తూత్తుకుడి హార్బర్ నుంచి అమెరికాకు జీడిపప్పు ఎగుమతులు పూర్తిగా స్తంభించాయి. దీంతో, జీడిపప్పు సాగుపై ఆధారపడిన జీవిస్తున్న వేలాది మంది మహిళా కార్మికులు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. ఈ విషయమై తమిళనాడు జీడిపప్పు ఎగుమతి, దిగుమతిదారుల సంఘ కోశాధికారి సెల్వమణి మాట్లాడుతూ... అమెరికా ప్రకటనతో, ఇప్పటివరకు రూ.1,000 కోట్లకు పైగా వ్యాపార లావాదేవీలు నిలిచిపోయాయని, కేంద్ర ప్రభుత్వం తక్షణం స్పందించి 50 శాతం పన్ను నుంచి మినహాయింపు పొందేలా అమెరికాతో చర్చలు జరపాలని సెల్వమణి కోరారు.

కుక్కల దాడిలో ముగ్గురికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

తిరుత్తణి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రోడ్డు మీద నడిచి వెళ్తున్న ముగ్గురిపై వీధికుక్కలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలయ్యారు. వివరాలిలా.. తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సమీపంలోని అరక్కోణం తాలూకాలోని గురురాజపేట గ్రామంలో నేత కార్మికులు దేవకి (50), సుధ (48), వెంకటేశన్ (38) ఆదివారం సాయంత్రం రోడ్డుపై వెళ్తుండగా, హఠాత్తుగా వీధికుక్కలు వారిపై దాడి చేశాయి. వారు కేకలు వేయడంతో స్థానికులు వెళ్లి కుక్కలను తరిమివేశారు. అప్పటికే దేవకి, సుధ, వెంకటేశన్ కుక్కల దాడిలో గాయపడ్డారు. స్థానికులు వెంటనే వారిని తిరుత్తణి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీధికుక్కల బెడద రోజురోజుకూ ఎక్కువవుతోందని, తక్షణ చర్యలు చేపట్టి వీధికుక్కలను నివారించాలని ఆ ప్రాంత ప్రజలు అధికారులను కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థులకు గాయాలు

వేలూరు, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కాట్పాడిలోని ఓ ప్రైవేటు కళాశాలలో చదువుకుంటున్న ఐదుగురు ఉత్తరాది విద్యార్థులు రోడ్డుప్రమాదంలో గాయపడి ఆస్పత్రి పాలైయ్యారు. పోలీసుల విచారణలో కాట్పాడిలోని ఓ హాస్టల్‌లో ఉంటూ కళాశాలలో చదువుకుంటున్న కృష్ణా చావ్లా, రవీద్ గుప్తా, ఉత్రాకాష్ కగోకి, సూర్యన్ కౌర్, శుభన్‌కుమార్ సోమవారం కారులో టూర్ వెళ్లివస్తుండగా, కారు అదుపు తప్పి కోనవట్టం సమీపంలోని వంతెన డివైడర్‌ను ఢీకొని కారుతో సహా కిందపడిపోయారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా క్షతగాత్రులను ప్రభుత్వాసుపత్రికి తరలించి దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉండగా, గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

● వాచ్‌మన్ లాకప్‌డెత్ కేసు..

సీబీఐ ఛార్జిషీట్‌ను తిరస్కరించిన కోర్టు

చెన్నై, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శివగంగ జిల్లా తిరుభువనం తాలూకా మడపురం కాళియమ్మన్ ఆలయం వద్ద పనిచేసిన వాచ్‌మన్ అజిత్‌కుమార్ లాకప్‌డెత్ కేసుపై ఛార్జిషీటును సమర్పించిన సీబీఐకి మదురై జిల్లా కోర్టులో చుక్కెదురైంది. ఆ ఛార్జిషీటులో ఎన్నో లోపాలున్నాయంటూ కోర్టు ఛార్జిషీట్‌ను తిరస్కరించింది. వాచ్‌మన్ అజిత్‌కుమార్‌ను పోలీసులు నిర్బంధించి నానా చిత్రహింసలకు గురి చేసి హత మార్చారు. ఆ సంఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్‌మీడియా వెలువడి రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించాయి. హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ ఉత్తర్వుల మేరకు ఈ కేసు విచారణ సీబీఐ చేపట్టింది. ఆగస్టు 20లోగా సమగ్రంగా విచారణ జరిపి, చార్జిషీటు మదురై జిల్లా కోర్టులో సమర్పించాలని హైకోర్టు ఆదేశించింది. ఆ మేరకు సీబీఐ అధికారులు ఛార్జిషీట్ సమర్పించారు. పది రోజులపాటు ఆ ఛార్జిషీట్ క్షుణ్ణంగా పరిశీలించిన మదురై జిల్లా కోర్టు అందులో ఎన్నో లోపాలున్నాయని ఆరోపించింది. ఛార్జిషీట్‌ను తిప్పి పంపి, తప్పులను, లోపాలను సరిదిద్ది మళ్లీ సమగ్ర వివరాలతో ఛార్జిషీట్ సమర్పించాలని సీబీఐకి ఆదేశించింది.

అలల్లో చిక్కుకున్న విద్యార్థులు.. రక్షించిన పోలీసులు

పెరంబూర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక మెరీనా బీచ్‌లో వేర్వేరు ఘటనలో నీటిలో మునిగిన నలుగురు కళాశాల విద్యార్థులను రక్షించి, ఓమందూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆదివారం సాయంత్రం చెన్నై సవితా కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న మహ్మద్ ఇర్ఫాన్, తీరంలో స్నానం చేస్తున్న సమయంలో భారీ అలలో చిక్కుకున్నాడు. చుట్టుపక్కల వారు, పోలీసులు అతడిని రక్షించి ఓమందూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అలాగే, కర్ణాటక రాష్ట్రం కోలారు ప్రాంతానికి చెందిన కళాశాల జట్టు పెరంబూర్‌లో జరిగిన ఫుట్‌బాల్ పోటీలో పాల్గొనగా, ఆదివారం జరిగిన సెమీఫైనల్‌లో ఓటమి పాలయ్యారు. అనంతరం జట్టుకు చెందిన 8మంది విద్యార్థులు సాయంత్రం మెరీనా బీచ్‌కు వెళ్లారు. వారు స్నానంచేస్తుండగా సచిన్, రినీష్, అశోక్‌కుమార్ అలల్లో చిక్కుకున్నారు. పోలీసులు వారిని రక్షించి ఓమందూర్‌ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై అన్నా స్క్వేయర్, మెరీనా పోలీసులు కేసు నమోదుచేసి విచారిస్తున్నారు

4న రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అదనపు టోకెన్లు

చెన్నై, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): శుభ ముహూర్తపు రోజైన గురువారం రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో అదనపు టోకెన్లు అందించనున్నారు. ఈ మేరకు రిజిస్ట్రేషన్ శాఖ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో... ఒక సబ్ రిజిస్ట్రార్ ఉన్న కార్యాలయాల్లో సాధారంగా ఇచ్చే వంద టోకెన్లకు బదులు 150, ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు ఉండే కార్యాలయాల్లో 200 టోకెన్లకు బదులు 300 టోకెన్లు అందించనున్నామన్నారు. అలాగే, తత్కాల్ ప్రాతిపదికన నాలుగు అదనపు టోకెన్లు అందించనున్నట్లు రిజిస్ట్రేషన్ శాఖ తెలిపింది.

నేడు తిరుత్తణి కొండపైకి భారీ వాహనాల రద్దు



తిరుత్తణి ఆలయం



రెండో ఘాట్‌రోడ్డు

తిరుత్తణి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయ కొండపై చేపట్టిన రెండో ఘాట్‌రోడ్డు నిర్మాణం, ప్రధాన ఘాట్‌లపై మరమ్మతుల కారణంగా మంగళవారం భారీ వాహనాలను నిషేధిస్తున్నట్లు ఆలయ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. కొండపై పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ నియంత్రించేలా హిందూ దేవాదాయశాఖ నిర్వహణలో ఆలయానికి రెండో ఘాట్‌రోడ్డు నిర్మాణం పనులను జూలై 12వ తేదీ ప్రారంభించారు. ఈ నేపథ్యంలో, జాతీయ రహదారులశాఖ అధికారులు కొండపై కొలతలు, విస్తీర్ణతపై సమీక్ష నిర్వహించనున్న క్రమంలో మంగళవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వాహనాల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ క్రమంలో ఆలయానికి కేవలం ద్విచక్రవాహనాలు, ప్రభుత్వ బస్సులను మాత్రమే అనుమతిస్తామని, బుధవారం ఉదయం 7 గంటల నుండి అన్ని వాహనాలు యాథావిధిగా అనుమతించనున్నట్లు ఆలయ పాలక మండలి తెలిపింది. ఆవణి మాసంలోని మంగళవారం నేపథ్యంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది కావున, కొండపైకి అదనపు ప్రభుత్వ బస్సులను ఏర్పాటు చేయాలని పలు హిందూ సంఘాలు, మురుగన్ సేవా సంస్థల నిర్వాహకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో తాత్కాలిక లెక్చరర్ల నియామకం

● మంత్రి కోవి చెళియన్

పెరంబూర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆర్ట్స్ సైన్స్, విద్యా కళాశాలల్లో తాత్కాలిక ప్రాతిపదికన 560 గౌరవ లెక్చరర్లను నియమించనున్నట్లు ఉన్నత విద్యాశాఖ మంత్రి కోవి చెళియన్ తెలిపారు. మంత్రి సోమవారం మీడియాతో మాట్లాడుతూ... 2025-26 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ ఆర్ట్స్‌సైన్స్ కళాశాలల్లో అడ్మిషన్లు జరుగుతున్న నేపథ్యంలో, తరగతులు కూడా ప్రారంభించామన్నారు. పేద విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించాలి, అందరికి సమానంగా ఉన్నత విద్య లభించాలనే లక్ష్యాలతో ప్రభుత్వ కళాశాలలు లేని 15 ప్రాంతాల్లో ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే ఆర్ట్స్ సైన్స్ కళాశాలు, విద్యా కళాశాలలను సీఎం ఆదేశం మేరకు ప్రారంభించామని తెలిపారు. కళాశాలకు శాశ్వత లెక్చరర్ల నియామకంలో జాప్యం జరుగుతోందని, అప్పటివరకు విద్యార్థులకు ఇబ్బంది లేకుండా తాత్కాలిక గౌరవ లెక్చరర్ల నియామకాలు చేపట్టామని మంత్రి తెలిపారు.

కోర్టుకు హాజరైన ఎంపీ కదిర్ ఆనంద్

వేలూరు, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): కొన్ని నెలల క్రితం ఎంపీ కదిర్ ఆనంద్ ఇంట్లో, కార్యాలయాల్లో, కళాశాలల్లో ఈడీ అధికారులు జరిపిన ఆకస్మిక సోదాల్లో రూ.10.48 కోట్ల నగదు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా 2019లో జరిగిన ఎన్నికల్లో ఓటర్లను నగదు పంపిణీ చేసిన కేసు విచారణలో భాగంగా సోమవారం ఉదయం ఎంపీ కదిర్ ఆనంద్ వేలూరు జిల్లా సెసెన్స్‌కోర్టులో హాజరయ్యారు. ఆయనతో పాటు ఎంపీ సన్నిహితుడు పూంజోలై శ్రీనివాసన్, బంధువు దామోదరన్ కూడా కోర్టులో హాజరైయ్యారు. ఈ రెండు కేసుల విచారణ వేలూరు కోర్టు ధర్మాసనం ముందుకు రాగా, వీటిపై న్యాయమూర్తి ఎంపీ వివరణ కోరారు. ఇరుతరుపు న్యాయవాదుల వాదనలు విన్న న్యాయమూర్తి ఈ నెల 22వ తేదీలోగా పిటిషన్‌పై స్పష్టమైన నివేదిక దాఖలు చేయాలని ఆదేశించారు.

గంజాయి విక్రయం

● కేరళ యువకుడి అరెస్టు

అడయార్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నానగర్ టవర్ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న కేరళకు చెందిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి 56 గ్రాముల గంజాయి, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. అన్నా నగర్ సీఐ శరవణన్ ఆదేశం మేరకు ఈ ప్రాంతంలో పోలీసులు మఫ్టీలో అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించారు. ఆ సమయంలో ఒక బ్యాగుతో సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించగా వారు బ్యాగు కిందపడేసి అక్కడ నుంచి వెళ్ళిపోయారు. పోలీసులు వారిని వెంబడించి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా, కేరళకు చెందిన అర్జునన్ (27)గా గుర్తించారు. అతనిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

కావేరి హాస్పిటల్‌లో వృద్ధురాలికి హృద్రోగ శస్త్రచికిత్స

చెన్నై, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): గుండెకు రక్తాన్ని తీసుకెళ్లే నాళం కుంచించుకుపోయి బాధపడుతున్న 65 యేళ్ళ వృద్ధురాలికి ఆళ్వార్‌పేటలోని కావేరి హాస్పిటల్‌లో ట్రాన్స్ కేథెడర్ ఎడ్జ్‌టుఎడ్జ్ రిపేర్ (టీర్) అనే శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఈ కొత్త రకం చికిత్స ద్వారా అధిక పరిమాణంలో రక్తం వృధా అయ్యే అవకాశాలు లేవని, 'మైక్లిప్' అనే పరికరాన్ని ఉపయోగించి నాళాన్ని మెరుగుపరిచారు. ఈచికిత్స తర్వాత ఆమె 72 గంటల్లోనే సంపూర్ణంగా కోలుకున్నారని ఆస్పత్రి సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఆర్.అనంతరామన్ వెల్లడించారు. గుండె ఎడమవైపున్న ఎగువ, దిగువ గదుల మధ్య రక్త ప్రసరణ నియంత్రించే నాళం దెబ్బతిని ఆ వృద్ధురాలు ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చేరి, సకాలంలో చికిత్స పొంది కోలుకున్నట్టు తెలిపారు.

ఈతకొలనులను తనిఖీ చేయండి

● ఆరోగ్య శాఖ

చెన్నై, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈతకొలనులు తనిఖీ చేయాలని జిల్లా అధికారులకు ఆరోగ్య శాఖ ఉత్తర్వులు జారీచేసింది. కేరళ రాష్ట్రంలో అమీబా వైరస్ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో, రాష్ట్ర ఆరోగ్య శాఖ ముందస్తు జాగ్రత్తలు చేపట్టింది. సహజ నీటిలో కనిపించే ఈ అరుదైన రకం అమీబా ముక్కు ద్వారా శరీరంలోకి ప్రవేశించి మెదడును ప్రభావితం చేస్తుంది. ఆగస్టులో మాత్రమే కేరళలో ముగ్గురు మృతిచెందగా, 8 మంది చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో, రాష్ట్ర ప్రజా ఆరోగ్య శాఖ డైరెక్టర్ సోమసుందరం, అన్ని జిల్లాల ఆరోగ్యశాఖ అధికారులకు పంపిన ప్రత్యేక ఉత్తర్వుల్లో... కార్పొరేషన్, మున్సిపాలిటీ పరిధిలోని ఈత కొలనులు, నక్షత్ర హోటళ్లలో ఉన్న ఈత కొలనులను తనిఖీ చేయాలని ఆదేశించారు. ఈత కొలనుల్లోని నీటిని రెండు రోజులకు ఒక సారి మార్చాలని, క్లోరిన్ వేసి నీటిని శుద్ధి చేసేలా వాటి యజమానులకు ఉత్తర్వులు జారీచేయాలన్నారు. కలుషితమైన నీటివనరుల వద్దకు పిల్లలకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్త తీసవావాలని సూచించారు. అలాగే, పశ్చిమ కనుమల సరిహద్దు జిల్లాలు, చెన్నై నగరంలో వైరల్ జ్వరాలు వ్యాపిస్తున్నాయని, జ్వరం లక్షణాలు ఉన్న వెంటనే ఆస్పత్రుల్లో పరీక్ష చేయించుకుని, చికిత్స పొందాలని ఆరోగ్య శాఖ ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

ఎంబీబీఎస్ సీట్లు పెరిగే అవకాశం...!

● రెండో విడత కౌన్సెలింగ్ జాప్యం

పెరంబూర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్ సీట్లు పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో కౌన్సెలింగ్ నిర్వహణలో జాప్యం జరుగుతోంది. రాష్ట్రంలోని 10కి పైగా స్వయం ప్రతిపత్తి కళాశాలల్లో రెండో విడత కౌన్సెలింగ్‌లో 50 నుంచి 150 ఎంబీబీఎస్ సీట్లు చేర్చనున్నారు. నాలుగు డీమ్డ్ విశ్వవిద్యాలయాల్లో తలా 100 సీట్లు పెరిగే అవకాశముంది. దీంతో, రాష్ట్రంలో అదనంగా 1,750 ఎంబీబీఎస్ సీట్లు లభించే అవకాశముంది. ఇది విద్యార్థులు, తల్లిదండ్రులకు ఆనందం కలిగించే అంశమైనా, విద్యావేత్తలు మాత్రం అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం అడ్మిషన్లకు సంబంధించిన కౌన్సెలింగ్ తేది ప్రకటించకుండా వాయిదావేశారు. వైద్య విద్య నియంత్రించే నేషనల్ మెడికల్ కమిషన్, దేశవ్యాప్తంగా ఉన్న కళాశాలల దరఖాస్తులు పరిశీలిస్తోంది. ఫలితంగా, డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కింద ఉన్న మెడికల్ కౌన్సిలింగ్ కమిటీని విద్యార్థుల ప్రవేశాలు నిలిపివేయాలని కోరారు. అదే సమయంలో, గత నెల 29వ తేది నుంచి 2వ విడత కౌన్సెలింగ్ జరుగుతుందని ఇదివరకే ప్రకటించినా, షెడ్యూల్ మాత్రం విడుదల చేయలేదు. ఈ విషయమై ప్రభుత్వ వైద్యకళాశాల ప్రొఫెసర్ ఒకరు మాట్లాడుతూ...అడ్మిషన్లలో జాప్యం జరిగితే సిలబస్ సకాలంలో పూర్తిచేసేందుకు స్టడీ లీవ్, ఇతర సెలవులు తగ్గించి తరగతులు త్వరగా నిర్వహించాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. చివరి సంవత్సరం పరీక్షలు ఆలస్యమైతే, పీజీ అడ్మిషన్లలో కూడా సమస్యలు తలెత్తుతాయని అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఇంటింటికీ ప్రభుత్వ పథకాలు చేరాలి

● గ్రామ కమిటీ సమావేశంలో డీఎంకే నాయకులు



సమావేశంలో డీఎంకే నిర్వాహకులు

తిరుత్తణి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రతి కార్యకర్త కూడా పార్టీ కోసం సైనికుడిలా పనిచేయాలని పళ్లిపట్టు యూనియన్ డీఎంకే కార్యదర్శి చంద్రన్ పిలుపునిచ్చారు. వచ్చే ఏడాది జరిగే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని తిరుత్తణి ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ ఆదేశాల మేరకు తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు సమీపంలోని అతిమాంజేరిపేటలో సోమవారం ఉదయం జిల్లా డీఎంకే నేతల ఆధ్వర్యంలో గ్రామ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన చంద్రన్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో డీఎంకే ప్రభుత్వం ప్రజల కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిందని, ప్రభుత్వానికి, ప్రజలకు వారధుల్లాగా కార్యకర్తలు నిలవాలని, నూతనంగా అమలుపరిచిన పథకాలను తెలియజేసేలా ఇంటింటి ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంకే గ్రామ కమిటీ నిర్వాహకులు, పార్టీ కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

మాకు ఇల్లు కేటాయించమ్మా !

● కలెక్టర్ కాళ్లపై పడి మహిళ అభ్యర్థన



కలెక్టర్‌కు వినతిపత్రాలు సమర్పిస్తున్న ప్రజలు

వేలూరు, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): వేలూరు కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమంలో అర్జీ సమర్పించడానికి వచ్చిన ఓ మహిళ కలెక్టర్ కాళ్లపై పడి కన్నీటితో అభ్యర్థించింది. తనకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నాడని, గత కొన్నేళ్లుగా కలెక్టర్ కార్యాలయంలో ఇంటిపట్టా కోసం వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేదని, భర్తలేని తనకు పిల్లలను పోషించడం కష్టతరమవుతోందని కన్నీటి పర్యంతమైంది. దీనిపై స్పందించిన కలెక్టర్ సుబ్బలక్ష్మీ త్వరలోనే ఇంటిపట్టా అందజేస్తామని హామీ ఇచ్చారు. శివనాథపురానికి చెందిన మహిళలు తమకు ఉపాధి హామీ పని కల్పించడం లేదని వాపోయారు. ప్రజల నుండి వినతిపత్రాలు స్వీకరించిన కలెక్టర్ వాటిపై సత్వరచర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

నేడు 'ఉంగుళుడన్ స్టాలిన్' శిబిరాలు

పెరంబూర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నగరంలో మంగళవారం 'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరాల వివరాలను గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) విడుదల చేసింది. ఆ ప్రకారం, తిరువొత్తియూర్ మండల పరిధిలో 14వ వార్డు టీహెచ్ రోడ్డు సీఎస్ఐ చర్చి సమీపంలోని మైదానం, మాధవరం మండల పరిధిలో 32వ వార్డు సూరపట్టు షణ్ముగపురంలోని కమ్యూనిటీ హాలు, తండయారుపేట మండల పరిధిలో 44వ వార్డు పెరంబూర్ తులసింగం వీధిలోని ఎస్‌కేఎన్‌ఎస్ పీఎంసీ వివేకానంద విద్యాలయ జూనియర్ కాలేజ్, రాయపురం మండల పరిధిలో 49వ వార్డు పాత వాషర్‌మెన్‌పేట వైఎంసీఏ భవనం, జీఏ రోడ్డులో నిర్వహిస్తారు. అదే విధంగా తిరువిక నగర్ మండల పరిధిలో 99వ వార్డు పాత స్లాటర్ రోడ్డు, అన్నా నగర్ మండల పరిధిలో 89వ వార్డు మొగప్పేర్ మెయిన్ రోడ్డులోని చిన్నస్వామి కల్యాణ మండపం ప్రాంతాల్లో శిబిరాలు జరుగనున్నాయి. అలాగే, కోడంబాక్కం మండల పరిధిలో 101వ వార్డు కీల్పాక్కం గార్డెన్ కాలనీ సమీపంలోని జేజే స్టేడియం, టినగర్ మండల పరిధిలో 124వ వార్డు ఆర్కే మఠ్ రోడ్డు పీఎస్ హైయర్ సెకండరీ స్కూలు, వలసరవాక్కం మండల పరిధిలోని 135వ వార్డు అశోక్ నగర్ 1వ అవెన్యూలోని లక్ష్మీ మహల్, ఆలందూర్ మండల పరిధిలో 166వ వార్డు నంగనల్లూర్ ఎంజీఆర్ రోడ్డులోని హరిహరన్ మహల్, అడయర్ మండల పరిధిలో 180 వార్డు తిరువాన్మియూర్‌లోని మరుదీశ్వర కల్యాణ మండపం, పెరుంగుడి మండల పరిధిలో 191వ వార్డు జల్లడియాంపేట భారతీయర్ రోడ్డు సమీపంలోని హసన్ మెమోరియల్ కాలేజ్, షోలింగనల్లూర్ మండల పరిధిలో 194వ వార్డు ఇంజంబాక్కం ఈసీఆర్ రోడ్డులోని కైలాష్ గార్డన్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగే శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జీసీసీ విజ్ఞప్తి చేసింది.

పారిశుధ్య కార్మికుడి నిజాయితీ

● చెత్తలో దొరికిన ఉంగరం అప్పగింత



పారిశుధ్య కార్మికుడికి సంక్షేమ సహాయాలు అందజేస్తున్న ఎంపీ కదిర్‌ఆనంద్

వేలూరు, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): చెత్తకుండీలో దొరికిన బంగారం ఉంగరాన్ని పారిశుధ్య కార్మికుడు యజమానికి అప్పగించాడు. వివరాలిలా...వేలూరు కార్పొరేషన్ పరిధిలోని ఓల్డ్ టౌన్ లెదర్ వేర్‌హౌస్ మెయిన్ రోడ్డులో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న నవీన్ గత శనివారం చెత్త సేకరిస్తుండగా, చెత్తకుండీలో బంగారపు ఉంగరాన్ని గమనించాడు. అధికారుల సహకారంతో ఉషా అనే మహిళది ఆ ఉంగరం అని గుర్తించి ఆమెకు ఆ ఉంగరాన్ని అప్పగించి తన నిజాయితీని చాటుకున్నాడు. విషయం తెలిసిన వేలూరు ఎంపీ కదిర్‌ఆనంద్ సోమవారం ఉదయం పారిశుధ్య కార్మికుడు నవీన్‌ను తన కార్యాలయానికి పిలిపించి అతడికి రూ.25వేల నగదు సహా పలు సంక్షేమ సహాయాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కార్తికేయన్, మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కదిర్‌ఆనంద్ మీడియాతో మాట్లాడుతూ, వేలూరు ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రిలో పూర్తిస్థాయి వసతులు లేవని అభ్యర్థనలు వచ్చాయని, సీఎం స్టాలిన్‌కు చెప్పి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. లత్తేరి రైల్వేస్టేషన్ క్రాసింగ్ సొరంగం పనుల టెండర్లకు ఆదేశాలు జారీచేస్తామని ఆయన తెలిపారు.

బొజ్జగణపయ్య.. వెళ్లిరావయ్య..




గణేష్ నిమజ్జనం ఊరేగింపులో నిర్వాహకులు

తిరుత్తణి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు వానియర్‌వీధిలో గణేష్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం విగ్రహ నిమజ్జన ఊరేగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. గత నెల 27న పెట్టిన భారీ వినాయక విగ్రహాన్ని కమిటీ నిర్వాహకులు మినీ లారీలో ఊరేగింపుగా తీసుకెళ్లి నగర పోలీసు అధికారులు సూచించిన ఘాట్‌లో నిమజ్జనం చేశారు. కమిటీ నిర్వాహకులు భరత్, దివాకర్, వంశీ, రవి, శరవణ, చరణ్, వినోద్, తిలక్, అభిషేక్, యోగేష్, ఉత్తం, విశాల్, యువరాజ్, విక్కీ, హరీష్, గౌతమ్, కార్తిక్ పాల్గొన్నారు.

ఆస్పత్రిలో కొనసాగుతున్న కాంగ్రెస్ ఎంపీ దీక్ష

● ఫోన్‌చేసి పరామర్శించిన రాహుల్



ఎంపీ శశికాంత్ సెంథిల్‌ను పరామర్శిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం

చెన్నై, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఎస్ఎస్ఏ నిధులు రాష్ట్రానికి సత్వరం విడుదల చేయాలని కోరుతూ తిరువళ్లూర్ కాంగ్రెస్ ఎంపీ శశికాంత్ సెంథిల్ ఆస్పత్రిలోనూ నాలుగవ రోజైన సోమవారం దీక్ష కొనసాగించారు. తిరువళ్లూర్ కలెక్టర్ కార్యాలయం సమీపంలో గత నెల 29వ తేది ఎంపీ ఆమరణ దీక్ష చేపట్టారు. రెండో రోజు దీక్షలో ఉన్న ఎంపీకి బీపీ పెరగడంతో తిరువళ్లూర్ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా, అక్కడ ఆయన దీక్ష కొనసాగించారు. మెరుగైన చికిత్స అందించేలా ఆదివారం రాజీవ్ గాంధీ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఆయనకు వైద్యపరీక్షలు నిర్వహించి చికిత్స కొనసాగిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. ఈ క్రమంలో, ఎంపీ శశికాంత్ సెంథిల్‌ను ఆదివారం పార్లమెంటు ప్రతిపక్ష నేత, రాహుల్ గాంధీ ఫోన్‌చేసి పరామర్శించి ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు.సోమవారం ఎంపీని ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి దురై వైగో, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్‌లు ఆసుపత్రికి వెళ్లి పరామర్శించి, ఎంపీ దీక్షకు పూర్తి మద్దతు అందిస్తున్నట్లు ప్రకటించారు.

డీఎంకే నాయకుడి నివాసంలో భారీ చోరీ

చెన్నై, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా సింగపెరుమాళ్ కోవిల్‌లో నివసిస్తున్న డీఎంకే నాయకుడు యమునాబాయ్ నివాసంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చొరబడి 140 సవర్ల బంగారు నగలు, రూ.6లక్షల నగదు దోచుకెళ్ళారు. భారతియార్ వీధిలో నివసిస్తున్న యమునాబాయ్ కుమారుడు రతీష్ కాట్టాన్‌కుళత్తూరు డీఎంకే యువజన నాయకుడిగా వ్యవహరిస్తున్నారు. ఇద్దరూ పారిశ్రామికవేత్తలు. వేర్వేరు ఇళ్లలో నివసిస్తున్నారు. ఈ నేపథ్యంలో యమునా బాయ్ ఆదివారం సాయంత్రం తన కుమారుడు రతీష్ నివాసానికి వెళ్ళి రాత్రి అక్కడే పడుకున్నాడు. సోమవారం ఉదయం తన ఇంటికి రాగా, ఇంటిలో నగలు, నగదు దోపిడీకి గురైనట్లు తెలుసుకుని దిగ్భ్రాంతి చెందారు. సమాచారం తెలుసుకున్న తాంబరం పోలీసు కమిషనర్ పవన్‌కుమార్ రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ అరుణ్ ప్రిన్స్ సిబ్బందితో హుటాహుటిన అక్కడికి వెళ్ళి విచారణ జరిపారు.

మా నిర్మాణ సంస్థను మూసివేస్తున్నాం

● వెట్రిమారన్



దర్శకుడిగా కొనసాగడం చాలా సులభమని, నిర్మాతగా రాణించడం ఎంతో కష్టమని ప్రముఖ దర్శకుడు, జాతీయ అవార్డు గ్రహీత వెట్రిమారన్ పేర్కొన్నారు. ఆయన నిర్మాతగా గ్రాస్ రూట్ కంపెనీ పతాకంపై నిర్మించిన చిత్రం 'బ్యాడ్ గర్ల్' చిత్ర నిర్మాణం ఎపుడో పూర్తి చేసుకున్నప్పటికీ సెన్సార్ సమస్యల్లో చిక్కుకుంది. దీంతో ఆయన న్యాయపోరాటం చేసి, సెన్సార్ సర్టిఫికెట్ పొందాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో సోమవారం ఆ చిత్ర బృందం నగరంలో మీడియా సమావేశాన్ని ఏర్పాటుచేసింది. ఈ సందర్భంగా నిర్మాత వెట్రిమారన్ మాట్లాడుతూ, ' దర్శకుడిగా ఉండటం చాలా సులభం. కానీ, నిర్మాతగా వ్యవహరించడం ఎంతో కఠినం. తాను నిర్మించిన 'మనుషి', 'బ్యాడ్ గర్ల్' మూవీలు సెన్సార్ సమస్యల్లో చిక్కుకున్నాయి. వాటి నుంచి గట్టెక్కేందుకు న్యాయపోరాటం చేయాల్సి వచ్చింది. ఈ పరిస్థితుల్లో చిత్రాలు నిర్మించడం చాలా కష్టం. అందుకే మా నిర్మాణ సంస్థపై ఇక సినిమాలు నిర్మించను. 'బ్యాడ్ గర్ల్' చివరి చిత్రం. 'గ్రాస్ రూట్ కంపెనీ' మూసివేస్తున్నాం' అని వెట్రిమారన్ సభా వేదికగా ప్రకటించారు. కాగా, వర్షా భరత్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అంజలి శివరామన్ ప్రధాన పాత్ర పోషించారు. శాంతి ప్రియ, శరణ్య రవిచంద్రన్ తదితరులు ఇతర పాత్రలు పోషించారు. యుక్తవయసులో ఉన్న ఒక యువతి తాను పెరిగే క్రమంలో ఏర్పడే కోర్కెలు, ఆశలు, కలలను ఏవిధంగా తీర్చుకుంది?, ఆమెను సమాజం ఎలా చూసింది? వంటి అంశాలతో రూపొందింది. ఈ చిత్రానికి యూఏ సర్టిఫికెట్ మంజూరు చేయగా, ఈ నెల 5న విడుదలకానుంది.

సూపర్‌స్టార్‌ను చూశాకే సినిమాపై మోజు పెరిగింది

- శివకార్తికేయన్



'మదరాసి' చిత్రంలో శివకార్తికేయన్, రుక్మిణి వసంత్

సూపర్‌స్టార్ రజనీకాంత్‌ను చూశాకే తనకు సినిమా అంటే ఇష్టం ఏర్పడిందని హీరో శివకార్తికేయన్ అంటున్నారు. కోవైలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, 'నాకు ప్రేరణ, ఆదర్శం.. అంతా రజనీకాంత్. అతనిని చూసిన తర్వాతే నాకు సినిమా అంటే ఇష్టం కలిగి సినిమాల్లోకి రావాలని అనిపించింది. ఆయన గొంతు అనుకరించి మిమిక్రీ చేయడం మొదలుపెట్టిన తర్వాత కరతాళ ధ్వనులు, చప్పట్లు, అవకాశాలు ఇలా అన్నీ సమకూరాయి' అని శివకార్తికేయన్ అన్నారు. కాగా, ఏఆర్.మురుగదాస్ దర్శకత్వంలో ఆయన నటించిన తాజా చిత్రం 'మదరాసి' ఈ నెల 5వ తేదీన విడుదలకానుంది.

టీఎఫ్ఏపీఏ అధ్యక్షుడిగా టీజీ త్యాగరాజన్



రిటర్నింగ్ అధికారి నుంచి ధ్రువ పత్రాన్ని స్వీకరిస్తున్న ప్రధాన కార్యదర్శి శివ

తమిళ్ ఫిల్మ్ యాక్టివ్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ (టీఎఫ్ఏపీఏ) నూతన అధ్యక్షుడిగా ప్రముఖ సీనియర్ నిర్మాత, సత్యజ్యోతి ఫిలిమ్స్ అధినేత టీజీ త్యాగరాజన్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. 2020లో సీనియర్ దర్శకుడు భారతీరాజా స్థాపించిన ఈ సంఘంలో అనేకమంది నిర్మాతలు సభ్యులుగా ఉన్నారు. ప్రస్తుతం ఇందులో 365కుపైగా సభ్యులుండగా, ప్రతి మూడేళ్ళకు ఒకసారి ఎన్నికలు నిర్వహిస్తారు. ఆ ప్రకారంగా 2025-28 సంవత్సరానికిగాను ఆదివారం ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల నిర్వహణాధికారిగా ప్రముఖ సీనియర్ దర్శకుడు ఆర్.వి.ఉదయకుమార్‌ను నియమించారు. అయితే, ఈ ఎన్నికల్లో నామినేషన్ వేసిన వారంతా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సంఘం అధ్యక్షుడుగా టీజీ త్యాగరాజన్ (సత్యజ్యోతి ఫిలిమ్స్), ప్రధాన కార్యదర్శిగా టి.శివ (అమ్మ క్రియేషన్స్), కోశాధికారిగా జి.ధనంజయన్ (క్రియేటివ్ ఎంటర్‌టైనర్స్ అండ్ డిస్ట్రిబ్యూటర్స్), ఉపాధ్యక్షులుగా ఎస్ఆర్ ప్రభు (డ్రీమ్ వారియర్స్), ఎస్ఎస్ లలిత్ కుమార్ (సెవెన్ స్క్రీన్ స్టూడియో), జాయింట్ సెక్రటరీలుగా ఎస్.వినోద్ కుమార్ (మిని స్టూడియోస్), ముఖేష్ ఆర్. మెహతా (ఈ4 ఎక్స్‌పెరిమెంట్స్ ఎల్ఎల్‌పీ), ఈసీ సభ్యులుగా కేఎస్ రవికుమార్, సుందర్ సి, ఎస్ లక్ష్మణ్ కుమార్, సుధన్ సుందరం, రమేష్ పి.పిళ్లై, విఘ్నేశ్వర్ ఎస్, కార్తికేయన్ సంతానం, ఆర్.రాజమోహన్, నితిన్ సత్య, కమల్ బోరా ఉన్నారు.

చిత్రజ్యోతి

బికినీలో అదరగొడుతున్న కాజల్



కాజల్ అగర్వాల్

ఓ బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత కూడా హీరోయిన్ కాజల్ అగర్వాల్ తన అందంతో అభిమానుల మతి పోగొడుతోంది.. ఇండస్ట్రీలో ఓ వెలుగు వెలిగిన హీరోయిన్ కాజల్ తమిళం, తెలుగుతో పాటు భాషా చిత్రాల్లో నటించారు. కొన్నేళ్ల క్రితం వివాహం చేసుకున్న కాజల్ ఓ బిడ్డకు జన్మనిచ్చారు. అదేసమయంలో కమల్ హాసన్ నటించిన 'ఇండియన్-2'లో ఓ కీలక పాత్ర పోషించినప్పటికీ వీటిని మూడో భాగానికి మార్చారు. అయితే, 'ఇండియన్-3' మూవీ ఎపుడు విడుదల అవుతుందో తెలియదు. ఈ నేపథ్యంలో ఓ బిడ్డ తల్లి అయిన కాజల్... తన శరీరాన్ని మాత్రం ఎంతో ఫిట్‌గా, నాజూగ్గా ఉంచుకున్నారు. గత వారం చీర కట్టులో కనిపించి, ఈ వారం పసుపు రంగు స్విమ్ సూట్‌తో ఫొటోలకు ఫోజులిచ్చారు. తన కుటుంబంతో కలిసి మాల్దీవులకు విహారయాత్రకు వెళ్ళిన సందర్భంగా బికినీ దుస్తుల్లో తీసిన ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు.

'మీనా బజార్' ప్రదర్శన ప్రారంభం



ప్రదర్శనను ప్రారంభిస్తున్న నటి కోమల్ శర్మ

చెన్నై, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎగ్మూరులోని రాజా ముత్తయ్య రాణి మేయమ్మై హాలులో సోమవారం 'ఆర్‌సీసీ మీనా బజార్' పేరిట మహిళా ఫ్యాషన్ ప్రదర్శన ఏర్పాటైంది. రెండు రోజుల పాటు జరిగే ఈ ప్రదర్శనను ప్రముఖ సినీ నటి కోమల్ శర్మ ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో రకరకాల ఆభరణాలు, ఫ్యాషన్ ఉపకరణాలు, పాదరక్షలు, గృహాలంకరణ, జీవన శైలి ఉత్పత్తుల్లో అత్యుత్తమైన 150కి పైగా స్టాళ్లను ఒకే చోట చేర్చారు. ప్రదర్శనకు వచ్చే వినియోగదారులకు విలువైన లక్కీ జాక్‌పాట్ బహుమతులు కూడా అందిస్తున్నట్లు నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

భగవతి అమ్మన్ ఆలయంలో 4న ఓనం వేడుకలు



భగవతి అమ్మన్ ఆలయం

చెన్నై, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కన్నియాకుమారి భగవతి అమ్మన్ ఆలయంలో ఓనం ఉత్సవాలు ఈ నెల 4 నుంచి 6 తేదీ వరకు జరుగనున్నాయి. ఈ నెల 4న ఉత్తరాషాఢ నక్షత్రం సందర్భంగా ఆకుపచ్చని పట్టు వస్త్రాలు, 5న శ్రవణం నక్షత్రం పురస్కరించుకుని కేరళ సంప్రదాయ శ్వేత వర్ణ పట్టు వస్త్రాలు, 6న ధనిష్ఠ నక్షత్రం సందర్భంగా ఎరుపు రంగు పట్టువస్త్రాలతో అమ్మవారికి అలంకరించి భక్తులకు దర్శనం కల్పించనున్నారు. ఈ మూడు రోజులూ ఉదయం 10 గంటలకు అమ్మవారికి పంచామృతం తదితర సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు కూడా నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు అమ్మవారికి స్వర్ణకిరీటం, వజ్రాలు పొదిగిన ముక్కుపుడక, స్వర్ణాభరణాలు, స్వర్ణ కవచం ధరింపజేస్తారు. వేకువజాము 4.30 గంటలకు నిర్మాల్యపూజ, విశ్వరూప దర్శనం, ఐదుగంటలకు అభిషేకం చేస్తారు. ఈ వేడుకలకు సంబంధించి ఏర్పాట్లను కన్నియాకుమారి జిల్లా ఆలయాల డిప్యూటీ కమిషనర్ జాన్సీ రాణి, నాగర్‌కోవిల్ దేవసంబోర్డు సూపరింటెండెంట్ పి.ఆనందన్, కన్నియాకుమారి భగవతి అమ్మన్ ఆలయ మేనేజర్ ఎస్.ఆనంద్ తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

తిరువళ్లువర్ ప్రీమియర్ లీగ్ విజేత ఇండియన్ బ్యాంక్



విజయోత్సాహంలో ఇండియన్ బ్యాంక్ జట్టు సభ్యులు

చెన్నై, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎగ్మూరులోని ఎస్‌డీఏటీ మేయర్ రాధాకృష్ణన్ హాకీ స్టేడియంలో జరిగిన తిరువళ్లువర్ ప్రీమియర్ లీగ్ (టీపీఎల్) 3.0 విజేతగా ఇండియన్ బ్యాంక్ జట్టు నిలిచింది. ఫైనల్లో ఇండియన్ బ్యాంక్ జట్టు, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ జట్టు తలపడ్డాయి. హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్‌లో ఇండియన్ బ్యాంక్ జట్టు 4, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ జట్టు 3 గోల్స్ చేశాయి. ఆగస్టు 11 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించిన ఈ లీగ్‌లో మొత్తం పది జట్లు పాల్గొన్నాయి. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌కు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ఎం నాజర్ విజేతకు ట్రోఫీ, రూ.50 వేల నగదు అందజేశారు. అదే విధంగా రన్నరప్ జట్టుకు రూ.30 వేలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎగ్మూర్ ఎమ్మెల్యే పరందమెన్, హాకీ తిరువళ్లూరు జట్టు అధ్యక్షుడు డాక్టర్ ప్రకాష్ అయ్యాదురై తదితరులు పాల్గొన్నారు.

'సిక్స్ వే'గా చెన్నై-వేలూరు హైరోడ్డు



పెరంబూర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జాతీయ రహదారుల శాఖ చెన్నై నుంచి వేలూరు రహదారిని ఆరు లేన్ల జాతీయ రహదారిగా విస్తరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు తమిళనాడు జాతీయ రహదారుల శాఖ ఈ ప్రాజెక్ట్ చేపట్టనుంది. ఈ రహదారి మూడు ప్రధాన సిప్కాట్ పార్క్‌లున్న ఒరగడం, చెయ్యారు, వేలూరు జిల్లాల మీదుగా ఏర్పాటుకానుంది. ఈ రహదారితో కాట్టుపల్లి, ఎన్నూర్ హార్బర్లకు సరుకులు వేగంగా తరలించే అవకాశముంది. ఈ విషయమై అధికారులు మాట్లాడుతూ... ఈ ప్రాజెక్ట్ పూర్తయితే శ్రీ పెరుంబుదూర్, వేలూరు మార్గంతో పాటు చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలో ట్రాఫిక్ రద్దీ తగ్గడంతో పాటు, ఇరు మార్గాల్లో సరుకు, ప్రయాణికుల వాహనాలు త్వరగా గమ్యస్థానాలకు చేరుకునే అవకాశముందన్నారు. ఈ ప్రాజెక్ట్ రవాణా వ్యవస్థ మెరుగుపరచడానికి మాత్రమే కాకుండా ఈ ప్రాంతాల్లో కొత్త పరిశ్రమలు, సిప్కాట్ హబ్‌లు ఏర్పాటుకు దోహదపడుతుందని అధికారులు పేర్కొన్నారు.

ప్రాచీన శిల్పాలు... చరిత్రకు సజీవ సాక్ష్యాలు

● ఎండకు, వానకు తడుస్తున్న పురావస్తు సంపద

● విల్లుపురంలో మ్యూజియం ఏర్పాటయ్యేనా?



ఎన్నాయిరం గ్రామం ముళ్లపొదల మధ్యలో ఉన్న చోళుల కాలం నాటి దక్షిణామూర్తి

టి.నగర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నో చారిత్రక విశిష్టతలు కలిగిన విల్లుపురం జిల్లాలో బయల్పడిన ఎన్నో ప్రాచీన శిల్పాలు సంరక్షించేవారు లేక ఎండకు ఎండుతూ, వానకు తడుస్తున్నాయి. ఈ శిల్పాల కోసం ప్రత్యేకంగా ఓ మ్యూజియం ఏర్పాటు చేసి వాటిని భద్రపరచి, భావితరాలు వాటి చరిత్ర తెలుసుకునేందుకు తోడ్పడాలని పురావస్తుపరిశోధకులు, చరిత్రకారులు, స్థానికులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. విల్లుపురం జిల్లా చరిత్రకపరంగా పలు ప్రత్యేకతలను సంతరించుకుంది. చోళుల కాలం నాటి తిరువమాత్తూరు అభిరామేశ్వరాలయం వంటి ప్రాచీన ఆలయాలు ఈ జిల్లాలోనే ఉన్నాయి. ఇవి కాకుండా తిరువక్కరై జాతీయ శిలాజాల ఉద్యానవనం కూడా ఉంది. తాజాగా ఈ జిల్లాలోని సెంజి కోటను జాతీయ వారసత్వ సంపదగా యునెస్కో గుర్తించింది. ఇలా చారిత్రక ప్రసిద్ధి చెందిన విల్లుపురం జిల్లాలో చరిత్రకారులు, పురావస్తు పరిశోధకులు, శిలాశాసనాల పరిశోధకులు తరచూ పర్యటించి ప్రాచీన శిలాశాసనాలు, శిల్పాలను గుర్తించి వాటి విశేషాలను ప్రపంచానికి పరిచయం చేస్తున్నారు. అయితే చరిత్రకారులు, పురావస్తు పరిశోధకుల ద్వారా బయల్పడిన ఎన్నో శిల్పాలు జిల్లా అంతటా ఎక్కబడితే అక్కడ సంరక్షించేవారు లేక మట్టికొట్టుకుపోతున్నాయని చరిత్ర పరిశోధకులు ఆందోళన చెందుతున్నారు.



కాప్పియంపులియూరు చెరువు వద్ద బయల్పడిన పల్లవుల కాలం నాటి మురుగన్ విగ్రహం

పల్లవులు, చోళులకాలం నాటి శిల్పాలు..

విల్లుపురం జిల్లాలో గత మూడు దశాబ్దాలుగా వందల సంఖ్యలో ప్రాచీన శిల్పాలు బయల్పడ్డాయి. జ్యేష్టాదేవిగా పిలిచే 'మూత్తదేవి', 'కోట్రవై' అని పిలిచే దుర్గాదేవి, సప్త మాతలు, మహావిష్ణువు, మురుగన్, సూర్యభగవానుడు, తీర్థంకరులు తదితర దేవతామూర్తుల శిల్పాలతోపాటు ప్రాచీన కాలం నాటి వీరుల శిల్పాలు కూడా పురావస్తు పరిశోధకులు, చరిత్రకారుల అన్వేషణలో బయల్పడ్డాయి. అంతే కాకుండా విల్లుపురం ప్రాంతాన్ని పాలించిన కాటవరాయర్, సేత్తిరాయర్, మలైమన్నర్ తదితర రాజుల శిల్పాలను కూడా కనుగొన్నారు. ఈ శిల్పాలన్నీ పల్లవులు, చోళులు, విజయనగర రాజుల కాలం నాటివి. అంటే క్రీ.శ. 7వ శతాబ్దం నుండి 16వ శతాబ్దం మధ్య కాలం నాటివని చరిత్రకారులు గుర్తించారు. పలు శిల్పాల్లో వాటి విశిష్టతను భావి తరాలు తెలుసుకునేలా తమిళ లిపిలో చెక్కబడి ఉండటం విశేషం. ఇలాంటి శిల్పాలే కాకుండా విగ్రహాలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా ఏనుగుపై కూర్చున్న మురుగన్ విగ్రహాలు (ఆనాంగూర్, కప్పియాంపులియూర్), సోమస్కందుడు (నన్నాడు) వంటి పల్లవుల కాలం నాటి శిల్పాలు కూడా ఉన్నాయి. ఈ విగ్రహాలను గుర్తించిన వెంటనే విల్లుపురం జిల్లా కలెక్టర్ పురావస్తుపరిశోధన శాఖ, ప్రదర్శనశాలల శాఖ ఉన్నతాధికారులకు తక్షణ సమాచారం కూడా అందించారు. అయితే ఆ శాఖలకు చెందిన ఉన్నతాధికారులలు ఈ అరుదైన శిల్పాల సంరక్షణ గురించి పట్టించుకోలేదని విల్లుపురం ప్రాంతానికి చెందిన చరిత్రకారుడు, రచయిత కో. సెంగుట్టువన్ ఆరోపించారు. ఆనాంగూర్ వద్ద లభ్యమైన పల్లవుల కాలం నాటి మురుగన్ విగ్రహాన్ని రాష్ట్ర పురావస్తు పరిశోధన శాఖ ఉన్నతాధికారులు గత యేడాది సెప్టెంబర్‌లో స్వయంగా పరిశీలించారు. విల్లుపురం వళుదరెడ్డి మురుగన్ విగ్రహాన్ని రాష్ట్ర ప్రదర్శనశాలల అధికారులు ఆరునెలల క్రితం పరిశీలించి వెళ్ళారు. ఆ తర్వాత తదుపరి చర్యలేవీ చేపట్టలేదు. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో లభ్యమైన దేవతామూర్తులకు నిత్య పూజా కార్యక్రమాలు నిర్వహించడానికి, లేదా ఆలయాలు నిర్మించేందుకు అనుమతించాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వ ట్రెజరీలో వందల సంఖ్యలో ప్రాచీన విగ్రహాలు మగ్గుతున్నాయని, అలాంటప్పుడు తాజాగా లభ్యమైన విగ్రహాలను సంరక్షించేందుకు ఈ ప్రాంతంలోనే మ్యూజియం నిర్మిస్తే సమంజసంగా ఉంటుందని, ఈ దిశగా జిల్లా అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని చరిత్రకారుడు సెంగుట్టువన్ తెలిపారు.

పనంకుప్పంలో మ్యూజియం...

విల్లుపురం జిల్లాలో మ్యూజియం నిర్మించేందుకు రెండేళ్ల క్రితమే రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందని, 2023లో కోలియనూరు సమీపంలోని పనంకుప్పం ప్రాంతంలో 1.5 ఎకరాల స్థలాన్ని కూడా ఎంపిక చేసినట్లు జిల్లా అధికారులు చెబుతున్నారు. జిల్లా కలెక్టర్ ఎస్.షేక్ అబ్దుల్ రహ్మాన్ ఇటీవల ఆ స్థలాన్ని కూడా పరిశీలించారు. మ్యూజియం ఏర్పాటుకు సంబంధించి ప్రజాపనుల శాఖ, ప్రదర్శనశాల శాఖ అధికారులతో సమీక్ష కూడా జరిపారు. మ్యూజియం ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించారు. ప్రస్తుతం ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చిన వెంటనే మ్యూజియం ఏర్పాటు పనులు ప్రారంభమవుతాయని ప్రజాపనుల శాఖ ఉన్నతాధికారులు తెలిపారు.

విజయవంతంగా ముగిసిన 'స్పేస్ తిరువిళా'



విద్యార్థులకు నగదు ప్రదానం చేస్తున్న మంత్రి అన్బిల్ మహేష్

అడయార్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్పేస్ కిడ్స్ ఇండియా (ఎస్‌కేఐ) ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు సాగిన 'స్పేస్ తిరువిళా 2025' విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా పలువురికి యంగ్ సైంటిస్ట్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ ప్రతిష్టాత్మక ఏరోస్పేస్ ఆర్గనైజేషన్‌ను డాక్టర్ కేసన్ 2013లో స్థాపించారు. అప్పటి నుంచి ఎస్‌కేఐ విద్యార్థుల నేతృత్వంలో అంతరిక్ష పరిశోధన తీరే మార్చివేసింది. ఈ సంస్థ ఇప్పటివరకు 19కి పైగా చిన్నపాటి బెలూన్ శాటిలైట్స్, మూడు సబ్ ఆర్బిటల్ పేలోడ్, ఐదు ఆర్బిటల్ ఉపగ్రహాలను రూపొందించి, ప్రయోగించింది. వీటిలో ఎన్నో ఉపగ్రహాలు పాఠశాల, కాలేజీ విద్యార్థుల సహకారంతో తయారు చేసినవి కావడం గమనార్హం. ఈ నేపథ్యంలో కోట్టూరుపురంలోని అన్నా సెంటినరీ లైబ్రరీ ఆడిటోరియంలో రెండు రోజుల పాటు స్పేస్ తిరువిళా 2025, యంగ్ సైంటిస్ట్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ఇందులో ఓవరాల్ విన్నర్‌గా పుదుచ్చేరికి చెందిన మొహ్మద్ తేజుద్దీన్ ఈ అవార్డును దక్కించుకున్నారు. తొలి రన్నరప్‌గా ఫాతిమా నౌరిన్ (కేరళ), సెకండ్ రన్నరప్‌గా హృషి పండిట్ (జమ్మూ కశ్మీర్),స్పెషల్‌అవార్డును జీవిక్(కర్ణాటక), అనుష్కసింగ్ (బిహార్), యామిని ఠాకూర్ (మధ్యప్రదేశ్), రాజారచ్చన (తమిళనాడు), శుభం కొనోజియా (మహారాష్ట్ర) అందుకున్నారు. అలాగే, ప్రైవేటు కేటగిరీలో శుభయు బెనర్జీ (తెలంగాణ), దినేష్ కార్తికేయన్ (తమిళనాడు), షగున్ కేసర్వానీ (రాజస్థాన్)లకు వరించింది. విజేతలకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ నగదు బహుమతి, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

వాల్‌టాక్స్ రోడ్డులో ఏసీ బస్ స్టాప్

● ప్రారంభించిన మంత్రి శేఖర్‌బాబు

అడయార్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉత్తర చెన్నై అభివృద్ధి పథకంలో భాగంగా, స్థానిక వాల్‌టాక్స్ రోడ్డులో కొత్తగా శీతలీకరణ సౌకర్యంతో నిర్మించిన నగర బస్టాపును రాష్ట్ర మంత్రి పీకే శేఖర్ బాబు సోమవారం ప్రారంభించారు. హార్బర్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇందులోభాగంగా, ఈ ఏసీ బస్టాపు నిర్మాణం పూర్తికాగా, దాన్ని మంత్రి ప్రారంభించారు. అలాగే, ఒత్తవాడై వీధిలో రూ.7 కోట్లతో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాలు పనులు, వాల్‌టాక్స్ రోడ్డులో నిర్మిస్తున్న 844 హౌసింగ్ బోర్డు గృహాలను, ప్లే గ్రౌండ్, స్టాన్లీ ప్రభుత్వ సాలైలో సీఎండీఏ నిర్మించే 776 బహుళ అంతస్తు గృహాల నిర్మాణ పనులను మంత్రి పీకే శేఖర్‌బాబు పరిశీలించారు. మంత్రి వెంట కార్పొరేషన్ ఉన్నతాధికారులు, స్థానిక కార్పొరేటర్లు ఉన్నారు.

రూ.3201 కోట్లతో పారిశ్రామిక పెట్టుబడులు

● మూడు జర్మన్ సంస్థలతో ఒప్పందం



బీఎండబ్ల్యు విస్తరణ కార్యక్రమాలపై ఏర్పాటైన సమావేశంలో పాల్గొన్న ముఖ్యమంత్రి స్టాలిన్, మంత్రి టీఆర్‌బీ రాజా, సంస్థ నిర్వాహకులు

చెన్నై, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విదేశీ పారిశ్రామిక పెట్టుబడుల సమీకరణ కోసం జర్మనీ వెళ్ళిన ముఖ్యమంత్రి స్టాలిన్ సమక్షంలో ఆ దేశానికి చెందిన మూడు సంస్థలు రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టేందుకు ముందుకొచ్చాయి. సోమవారం సాయంత్రం డెసెల్‌డార్ఫ్ నగరంలో జరిగిన పెట్టుబడీదారుల సమావేశంలో స్టాలిన్ పాల్గొన్నారు. ఆ సందర్భంగా నార్ బెర్మెస్, నార్డెక్స్ గ్రూపు, ఈబీఎం-పాప్స్ట్ సంస్థలు రూ.3201 కోట్ల మేరకు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అంగీకరించాయి. ఆ మేరకు స్టాలిన్ సమక్షంలో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఈ పెట్టుబడులతో స్థాపించే పరిశ్రమల ద్వారా 6250 మందికి ఉపాధి కలుగుతుందని ప్రభుత్వం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ సమావేశంలోనే బీఎండబ్ల్యు గ్రూపు నిర్వాహకులు కూడా పాల్గొని చెంగల్పట్టులోని తమ కర్మాగారంలో విస్తరణ కార్యకలాపాలకు సంబంధించి స్టాలిన్‌తో చర్చించారు.

13 యేళ్ళ రేసర్ ఆటోగ్రాఫ్ తీసుకున్న అజిత్



అజిత్‌కు ఆటోగ్రాఫ్ ఇస్తున్న 13 యేళ్ళ ఇమ్మానువేల్

అడయార్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జర్మనీలో జరుగుతున్న కార్ రేసింగ్ పోటీలకు హాజరైవున్న ప్రముఖ హీరో అజిత్ కుమార్ 13 యేళ్ళ యువ రేసర్ ఇమానువేల్ జోడన్ ఆటోగ్రాఫ్ తీసుకున్నారు. దీనికి సంబంధించిన వీడియోను అజిత్ బృందం సోషల్ మీడియాలో పోస్ట్ చేసారు. ఈ సందర్భంగా అజిత్ మాట్లాడుతూ, 'కార్ రేసింగ్ పోటీలకు ప్రాచుర్యం కల్పించడం నా కోసం కాదు. ఈ కార్ రేసింగ్ పోటీల్లో భారత్ తరఫున పాల్గొనే రేసర్ల కోసం. ఖచ్చితంగా ఒక రోజున ఫార్ములా వన్ రేస్ పోటీల్లోనే కాదు అన్ని రకాల కార్ రేసింగ్ పోటీల్లో భారత రేసర్లు విజేతలుగా నిలుస్తారు' అని అజిత్ ఆశాభావం వ్యక్తం చేశారు.



శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. నటులు అమితాష్ ప్రధాన్, ప్రియాంక జైన్, శివకుమార్, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం ఉన్నారు.



టీటీడీకి విరాళంగా టాటా ఏస్

తిరుమల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన టాటా మోటార్స్ వరలక్ష్మి ఆటో మొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.5.06 లక్షల విలువైన ఈ టాటా ఏస్ ప్రో వాహనాన్ని టీటీడీకి విరాళంగా అందజేసింది. ఆ సంస్థ ప్రతినిధులు రామ్‌ప్రసాద్, ప్రదీప్, రితేష్ రమేష్ కొటారి, మురళీకృష్ణ శ్రీవారి ఆలయం ముందు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ పేష్కార్ రామకృష్ణకు వాహనం తాళాలను అందజేశారు.



పేష్కార్‌కు వాహనం తాళాలను అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

సర్వదర్శనానికి 7 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 7 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 6 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.49 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,310

తలనీలాలు సమర్పించినవారు: 21,866



ముక్కంటి ఆలయంలో సెంట్రలైజ్డ్ సిస్టం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయంలో పాలనను సెంట్రలైజ్ సిస్టంతో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే సుధీర్ చెప్పారు. రాహుకేతు సర్పదోష నివారణ పూజల కోసం ఐదురకాల టిక్కెట్లు.. వివిధ అర్జిత సేవలు.. దర్శనాల టిక్కెట్లకు కౌంటర్లు కొనసాగిస్తున్నారు. అభిషేకాల కోసం మరో కౌంటర్ ప్రత్యేకంగా ఉంది. ఆలయానికి నాలుగు ప్రవేశ ద్వారాలు ఉండటంతో టిక్కెట్ల కోసం భక్తులకు ఏ కౌంటర్‌కు వెళ్లాలో తికమక పడాల్సిన పరిస్థితి ఉత్పన్నమయ్యేది. ఈ క్రమంలో అన్ని కౌంటర్లను ఒకే చోట ఏర్పాటు చేయడంపై అధికారులతో కలిసి ఇటీవల ఎమ్మెల్యే కసరత్తు చేశారు. సెంట్రలైజ్డ్ సిస్టంలో తొలి అడుగుగా అన్ని టిక్కెట్ కౌంటర్లను రెండో గేటు సమీపంలో ఏర్పాటు చేసేందుకు శ్రీకారం చుట్టారు. దీనికి షెడ్లు, క్యూలైన్లు, కంప్యూటర్లు, పరికరాల ఏర్పాటుకు సోమవారం పనులు ప్రారంభించారు. ఈ పనులను ఎమ్మెల్యే పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, టీడీపీ నాయకులు విజయకుమార్, చెంచయ్యనాయుడు, మునిరాజానాయుడు తదితరులు పాల్గొన్నారు.



ముక్కంటి ఆలయంలో అభివృద్ధి పనులపై సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్

సమస్యలివీ..పరిష్కరించండి

కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు 195 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలు అందలేదని... తమ భూములు వేరేవారు ఆక్రమించారని.. వందశాతం వికలత్వం ఉన్నా తగ్గించేశారని.. పొదుపు సొమ్మును ఆర్పీ స్వాహా చేసిందని పలువురు జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులుకు ఫిర్యాదు చేశారు. సమస్యలు పరిష్కారమయ్యేలా చూడాలని వేడుకున్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 195 అర్జీలు వచ్చాయి. అందులో రెవెన్యూ శాఖకే 108 ఉన్నాయి. కాగా, పాపానాయుడుపేటకు చెందిన దివ్యాంగురాలు షాజహాన్‌కు అధికారులు మూడు చక్రాల సైకిల్ అందజేశారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జేసీ శుభం బన్సల్

పింఛన్ ఇప్పించి పుణ్యం కట్టుకోండి



లారీడ్రైవర్‌గా పనిచేసేవాడిని. ప్రమాదంలో కాలు కోల్పోయాను. గత ప్రభుత్వంలో పింఛను కోసం అధికారుల చుట్టు తిరిగి అలసిపోయా. భిక్షాటన చేసి కుటుంబాన్ని పోషిస్తున్నా. చంద్రబాబు ప్రభుత్వంలోనైనా పింఛను ఇచ్చి ఆదుకోండి.

- కె.వెంకటేష్, తాటితోపు, తిరుపతి రూరల్



దివ్యాంగురాలికి ట్రైసైకిల్ అందజేస్తున్న జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్

సాయినగర్ సమస్యలు పరిష్కరించండి



తిరుపతి రూరల్ మండలం సాయినగర్ గ్రామ పంచాయతీ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని సర్పంచ్ డీవీ రమణ జేసీ శుభం బన్సల్‌కు విన్నవించారు. సాయినగర్, లింగేశ్వర్‌నగర్ పంచాయతీల్లో 40 ఏళ్లుగా హథీరాంజీ మఠం భూముల్లో నివాసముంటున్న ఇళ్లను క్రమబద్ధీకరణ చేయాలని కోరారు.

పొదుపు సొమ్ము కాజేశారని ధర్నా




తాము నెలనెలా కట్టే పొదుపు సొమ్మును బ్యాంకు అధికారులతో కలిసి ఆర్పీ నౌహీరా కాజేసిందని కొర్లగుంట మారుతీనగర్‌కు చెందిన స్వయం సహాయక మహిళలు ధర్నా చేశారు. తిరుపతిలో దాదాపు 40 సంఘాల సభ్యుల నుంచి రూ.కోటి వరకు స్వాహా చేసిందని, దాన్ని రికవరీ చేయాలని కోరారు. ఆమెకు సహకరించిన బ్యాంకు అధికారులపైనా చర్యలు తీసుకోవాలన్నారు.

తిరుమలలో మొదలైన విద్యుత్ అలంకరణ పనులు

తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు సమీపిస్తున్న క్రమంలో ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా విద్యుత్ అలంకరణ ఏర్పాట్లనూ టీటీడీ ప్రారంభించింది. ఇప్పటికే శ్రీవారి ఆలయ గోపురానికి సున్నం పనులు పూర్తయ్యాయి. సోమవారం నుంచి విద్యుత్ దీపాల అమరిక పనులను మొదలుపెట్టారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



గోపురానికి విద్యుత్ లైట్లను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

దళిత పిల్లలను చదువుకు దూరం చేయొద్దు

దళిత పిల్లలను చదువుకు దూరం చేయొద్దని శ్రీకాళహస్తి మండలం రాజుగుంట గ్రామస్తులు కోరారు. మా బడి మాకే కావాలంటూ ధర్నా నిర్వహించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి హేమలత మాట్లాడుతూ జిల్లాలో దళితులు ఎక్కడ ఉన్నారో ఆ పిల్లలను సుమారు 5, 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న బడికి మార్చడంతో వారు చదువుకు దూరమవుతున్నారని తెలిపారు. రాజుగుంట గ్రామానికి చెందిన పిల్లలను మన్నవరం మోడల్ స్కూల్‌లో కలపడం వల్ల శ్మశానం, చెరువు, అటవీ ప్రాంతం దాటుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఉందని, అందుకే వారు ఇప్పటివరకు పాఠశాలకు వెళ్లలేదని పేర్కొన్నారు. ఇప్పటికే మూడుసార్లు కలెక్టరేట్ వద్ద ధర్నా చేసినా పట్టించుకోకపోవడం దారుణమని, వెంటనే స్పందించాలని కోరారు.



'ఎర్ర'స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలుశిక్ష

రూ.ఆరు లక్షల జరిమానా

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబర్ 1(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలుశిక్షతోపాటు రూ.ఆరు లక్షలు జరిమానా విధిస్తూ సోమవారం రాష్ట్ర ఎర్రచందనం కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పు చెప్పారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ వివరాల మేరకు.. తమిళనాడుకు చెందిన అన్బు 2016లో జిల్లా పరిధిలోని పెరుమాళ్లపల్లి బీట్ టీఎన్ పాళ్యం సెక్షన్‌లో ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. అప్పటి నుంచి కేసు దర్యాప్తు జరుగుతోంది. తాజాగా ప్రత్యేక కోర్టుకు బదిలీ కావడంతో విచారణ చేసిన న్యాయమూర్తి సాక్ష్యాధారాలతో రుజువు కావడంతో అన్బుకు ఈ మేరకు శిక్ష విధించారు.

234 నియోజకవర్గాల్లో ఎన్డీయే విజయం తథ్యం

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్

చెన్నై, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో 234 నియోజకవర్గాల్లోనూ ఎన్డీయే విజయం ఖాయమని బీజేపీ రాష అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ జోస్యం తెలిపారు. బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జరిపిన సర్వేలో డీఎంకే కూటమి అన్ని చోట్లా చిత్తుగా ఓడిపోతుందని పేర్కొన్నారు. సోమవారం ఉదయం తెన్‌కాశి జిల్లా శంకరన్‌కోవిల్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీయేకి అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) అధ్యక్షుడిగా ఉన్నారని, ఈ విషయంలో ఎలాంటి అనుమానాలు అక్కర్లేదని చెప్పారు. మాజీ ముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం ఎన్డీయేలో కొనసాగుతున్నట్లుగానే తాము భావిస్తున్నామని, ఎఎంఎంకే నేత టీటీవీ దినకరన్ ఎన్డీయేలో కొనసాగుతున్న స్పష్టంగా ప్రకటించారని పేర్కొన్నారు.



శంకరన్‌కోవిల్‌లో మీడియాతో మాట్లాడుతున్న నయినార్ నాగేంద్రన్

బౌద్ధ యాత్ర సబ్సిడీకి దరఖాస్తుల ఆహ్వానం

చెన్నై, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బౌద్ధులు ఆధ్యాత్మిక యాత్రకు వెళ్లేందుకు అందిస్తున్న రూ.5,000 సబ్సిడీ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. బుద్ధుడు జన్మస్థలం లుంబినీ, జ్ఞానోదయం పొందిన బుద్ధ గయ, మొదటి బోధనల స్థలం సారనాథ్, మరణ స్థలం కుషినగర్ తదితరాలకు బౌద్ధ మతస్తులు వెళ్తుంటారు. బౌద్ధులు తీర్థయాత్రకు వెళ్లేందుకు ప్రభుత్వం వివిధ రాయితీలు కల్పిస్తోంది. ఆ ప్రకారం, 2025-26లో నాగపూర్‌లో జరుగనున్న ధమ్మ చక్ర పరివర్తన ఉత్సవాలకు వెళ్లి తిరిగి వచ్చే 150 మంది బౌద్ధులకు తలా రూ.5,000 సబ్సిడీ ఇవ్వనున్నారు. దానికోసం చేపాక్కంలోని కలస మహల్‌లో ఉన్న మైనార్టీ సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయంలో తగిన పత్రాలతో నవంబరు 30వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు www.bcm-bcmw.tn.gov.in అనే వెబ్‌సైట్ సంప్రదించవచ్చని ప్రభుత్వం తెలిపింది.

ఐదో సారి నిండిన వీరాణం చెరువు

పెరంబూర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): వీరాణం చెరువు ప్రస్తుత ఏడాదిలో ఐదో సారి పూర్తి స్థాయికి చేరుకుంది. కడలూరు జిల్లా కాట్టుమన్నార్‌కోయిల్ సమీపంలోని వీరాణం చెరువు జిల్లాలో సాగు, తాగునీటికి ఆధారం. అలాగే, చెన్నై నగర ప్రజల దాహార్తి కూడా ఈ జలాశయం తీరుస్తోంది. ఈ జలాశయం పూర్తి సామర్థ్యం 47.50 అడుగులు కాగా సోమవారం నాటికి ఈ ఏడాది ఐదవ సారి జలాశయం పూర్తిస్థాయికి చేరుకుందని ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

మెట్రోలో 99.09 లక్షల మంది ప్రయాణం

పెరంబూర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మెట్రోరైళ్లలో గత నెలలోనే 99.09 లక్షల మంది ప్రయాణించారు. ఈ మేరకు చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) సోమవారం విడుదల చేసిన ప్రకటనలో... ఆగస్టు 1 నుంచి 31వ తేది వరకు మెట్రో రైళ్లలో 99,09,632 మంది ప్రయాణించారని, ఆగస్టు 14వ తేది ఎక్కువగా 4,09,590 మంది ప్రయాణించారని తెలిపింది. ప్రయాణికుల్లో ఎన్‌సీఎంసీ సింగార చెన్నై కార్డు ద్వారా 48,71,627 మంది, సీఎంఆర్ఎల్ ట్రావెల్ కార్డు ద్వారా 2,24,246, సింగల్ జర్నీ పేపర్ క్యూఆర్, టోకెన్ ద్వారా 21,74,413 మంది, ఆన్‌లైన్ క్యూ ఆర్ టిక్కెట్ల ద్వారా 3,10,521, వాట్సాప్ (83000 86000) ద్వారా 6,12,757, పేటీఎం ద్వారా 4,28,846, ఓఎన్‌డీసీ ద్వారా 7,58,871, ఫోన్ పే ద్వారా 3,45,562, సీఎంఆర్ఎల్ మొబైల్ యాప్ ద్వారా 1,82,789 మంది టిక్కెట్లు కొనుగోలు చేసి ప్రయాణించారని సీఎంఆర్ఎల్ తెలిపింది.



అంబత్తూర్ కరుక్కు రోడ్డులో సోమవారం మధ్యాహ్నం ఏర్పడిన గుంత

తిరిగి తిరిగి అలసిపోయా..

● నా సమస్యపై అధికారులు పట్టించుకోలేదు

● గన్నేరుపప్పు తిని పీజీఆర్ఎస్‌కు వచ్చిన మహిళ

● తిరుపతి కలెక్టరేట్‌లో కలకలం.. ఆస్పత్రికి తరలింపు

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): 'నన్ను కులాంతర వివాహం చేసుకున్న శరత్‌కుమార్.. ఇప్పుడు రెండో పెళ్లికి సిద్ధమై నిశ్చితార్థం చేసుకున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఏమాత్రం స్పందించలేదు. కలెక్టరేట్ చుట్టూ నాలుగు పర్యాయాలు తిరిగినా న్యాయం జరగలేదు' అంటూ ఇందు అనే మహిళ గన్నేరుపప్పు (విషపు కాయలు) తిని తిరుపతి కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌కు వచ్చారు. జేసీ శుభంబన్సల్‌కు వినతిపత్రం ఇచ్చిన ఆమె.. అక్కడే అపస్మారక స్థితికి చేరుకున్నారు. దీంతో ఉలిక్కిపడ్డ అధికారులు ప్రథమ చికిత్స కేంద్రంలోని వైద్యులు, నర్సింగ్ సిబ్బందికి సమాచారమిచ్చారు. అనంతరం డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్ తన వాహనంలో ఆమెను రుయాస్పత్రికి తరలించారు. ఈమెది తిరుపతి నగరంలోని యాదవకాలనీ. 'నాలుగేళ్ల కిందట శరత్‌కుమార్‌రెడ్డితో ఓటేరు సాయిబాబా ఆలయంలో ప్రేమ వివాహమైంది. అతడి కుటుంబ సభ్యులకు మా పెళ్లి ఇష్టంలేదు. నిత్యం నన్ను తక్కువ జాతి కులమని వేధించేవారు. ఓ మెడికల్‌షాప్‌లో పనిచేసే నా భర్త రూ.10 లక్షలు కట్నం తెస్తేనే రానిస్తామన్నాడు. మే నెల 2న నన్ను వదలి వెళ్లిపోయాడు. నన్ను దళితురాలినంటూ వేధించడంపై పోలీసులకు ఫిర్యాదు చేశాను. ఇప్పుడు రెడ్డి కులానికి చెందిన అమ్మాయిని పెళ్లి చేసుకోవడానికి నిశ్చితార్థం చేసుకున్నాడు. నేను అడిగితే వాళ్లు బెదిరిస్తున్నారు. నా భర్తను నాతో పంపేలా చేసి, నన్ను ఇబ్బంది పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి' అని అధికారులకు ఇచ్చిన ఫిర్యాదులో ఆమె పేర్కొన్నారు. కాగా, బాధితురాలి ఫిర్యాదు మేరకు వివిధ సెక్షన్ల కింద తిరుపతి ఈస్ట్ పోలీసులు రెండు నెలల కిందటే కేసు నమోదు చేసున్నారు.



అధికారులకు ఫిర్యాదు చేశాక అపస్మారకస్థితికి చేరుకున్న ఇందు

15 జిల్లాల్లో పెరిగిన భూగర్భ జలమట్టాలు

పెరంబూర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నీలగిరి, తిరువణ్ణామలై, కళ్లకుర్చి సహా 15జిల్లాల్లో భూగర్భ జలమట్టాలు పెరిగాయి. నీటివనరుల శాఖ ఆధ్వర్యంలో ప్రతి నెలా చెన్నై మినహా 37 జిల్లాల్లో బావులు ఏర్పాటుచేసి భూగర్భ జలమట్టాలను గణిస్తుంటారు. జూలైలో కోవై, తంజావూరు, నాగపట్టణం, కన్నియకుమారి తదితర నాలుగు జిల్లాల్లో మాత్రమే భూగర్భ జలమట్టాలు పెరిగాయి. ఆగస్టులో కళ్లకుర్చి, తిరువణ్ణామలై, రాణిపేట, వేలూరు, తిరుపత్తూర్, కృష్ణగిరి, నీలగిరి, పుదుకోట, తిరుచ్చి, అరియలూరు, తంజావూరు, తిరువారూరు, నాగపట్టణం, మైలాడుదురై, కన్నియాకుమారి తదితర 15 జిల్లాల్లో నీటిమట్టాలు పెరిగాయి. గత ఏడాది ఇదే నెలలో 20 జిల్లాల్లో భూగర్భ జలాలు పెరిగాయని అధికారులు తెలిపారు.



రాయపురం జోన్ మన్నడి అంగప్పన్ వీధిలోని చెన్నై కార్పొరేషన్ ఉర్దూ మాధ్యమిక పాఠశాలలో రూ.1.89 కోట్లతో నిర్మించిన అదనపు భవనాన్ని ప్రారంభిస్తున్న డీఎంకే ఎంపీ దయానిధి మారన్. చిత్రంలో దేవాదాయశాఖ మంత్రి శేఖర్‌బాబు, మేయర్ ప్రియ తదితరులు

చెట్ల కిందే చదువులు...!



పెరంబూర్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): తేని జిల్లా మురుకోట ప్రభుత్వ మహోన్నత పాఠశాలల్లో తగినన్ని గదులు లేకపోవడంతో చెట్ల కిందే తరగతులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. కొండ గ్రామమైన మురుకోటలో ఉన్న ప్రభుత్వ పాఠశాలను 2012లో మహోన్నత పాఠశాల హోదాకు పెంచారు. ఈ పాఠశాలలో దండియన్‌కుళం, నీలముత్తయ్యాపురం, వీరచిన్నంపాళయం, ఉరుట్టిమేడు, ఎరుమైసునై, నందనాపుం, కామరాజపురం, రాయర్ గారెన్, వైగై నగర్ తదితర గిరిజన గ్రామాలకు చెందిన సుమారు 255 మంది విద్యార్థులు చదువుతున్నారు. మహోన్నత పాఠశాల హోదా పెంచినా తగినంతగా గదులు మాత్రం ఏర్పాటుచేయలేదు. దీంతో, ఒక గదిలో రెండు తరగతులు నిర్వహిస్తుండగా, పాఠశాల సమీపంలోని పంచాయతీ సేవా కేంద్రంలో మరో రెండు తరగతులు నిర్వహిస్తున్నారు. ఎక్కువగా చెట్ల కిందే తరగతులు నిర్వహిస్తున్నారు. వర్షం పడితే కొన్ని తరగతులకు సెలవు ఇవ్వాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని, ప్రభుత్వం స్పందించి అదనపు గదుల నిర్మాణం చేపట్టాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.